నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
1
శుక్రవారం | ఏప్రిల్ 05 , 2024 | www.navatelangana.com

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ టౌన్ వన్ పరిధిలో ఎస్టో నూతనంగా 5 ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సందర్భంగా నేడు ఉదయం 8 గంటల నుండి 12:00 వరకు పట్టణంలోని బంగారుగడ్డ, ఇస్లాంపురం, డాక్టర్ కాలనీ, విద్యానగర్, సీతారాంపురం, అశోక్ నగర్, సంతోష్ నగర్, శాంతినగర్, కృష్ణ కాలనీ ప్రాంతాల్లో కరెంటు నిలిపివేస్తున్నట్లు సబ్ డివిజన్ ఎలక్ట్రికల్ ఎడిఈ కోడిరెక్క రవికుమార్, టౌన్ వన్ ఎఈ వెంకట్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ వన్ సబ్ స్టేషన్ పరిధిలో 2 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు 8 ఎంవిఏ ఉన్నాయని, వీటికి సంబంధించినలోడు కన్నా ఎక్కువ కరెంటు వినియోగదారుల సర్వీస్ కనెక్షన్లు అధికంగా ఉండటంవల్ల వారికి ఇబ్బంది కలవకుండా నాణ్యమైన కరెంటు ఇచ్చేందుకు 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ నూతనంగా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు, వ్యాపారస్తులు, పరిశ్రమ దారులు సహరించాలని కోరారు.

కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో TS EAPCET-2024 అప్లైచేసిన తెలుగు మీడియం, ఇంగ్లీష్, ఉర్దూ మీడియం విద్యార్థులందరికి ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సీఈవో గోన గన్నారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఉచిత హాస్టల్ వసతి, ఉచిత స్టడీ మెటీరియల్ అందించబడును. నేడు ఉదయం 9గంటలకు తరగతులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.అనుభవం, అంకితభావం గల అధ్యాపకులచే అత్యుత్తమ బోధన ఉంటుందని, ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు తరగతులు, స్టడీ అవర్స్, చాప్టర్ల వారీగా పరీక్షలు వీక్లీ గ్రాండ్ టెస్టులు ఉంటాయని పేర్కొన్నారు. కావున EAPCET అప్లై చేసిన విద్యార్థులు ఉచిత కోచింగ్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.మరిన్ని వివరాలకు 9885659807, 9948268412, 9948867535, 9848727767, 9440835543. సంప్రదించాలని తెలిపారు.



పోలీసుల బైండోవర్ అస్త్రం..!

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 5,936 మంది పాత నేరస్థులు
- రౌడీ షీటర్ల కదలికలపై కన్ను

నవతెలంగాణ -నల్లగొండ టౌన్

లోకసభ ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా నల్లగొండ ఉమ్మడి జిల్లాలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టానున్నారు . ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిపై నిఘా పెట్టారు. ఇందులో భాగంగా రౌడీ షీటర్లు, నేరచరిత ఉన్న వారిని తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 5,936 మంది పాత నేరస్థులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ మొత్తం 5,936 మంది పాత నేరస్థులను గుర్తించింది. ఇందులో సూర్యాపేట జిల్లా లో 4100, యాదాద్రి భువనగిరి జిల్లాలో 1571 మంది, నల్లగొండ జిల్లాలో 265 మంది పాత నేరస్థులు, రౌడీషీట ర్లు ఉన్నారు. నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లోని రౌడీ షీటర్లపై గట్టి నిఘాపెట్టారు. జిల్లావ్యాప్తంగా ఉన్న రౌడీ షీ టర్లను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేస్తున్నారు.

రౌడీ షీటర్ల కదలికలపై కన్ను

జిల్లావ్యాప్తంగా రౌడీ షీటర్ల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. హత్యలు, దందాలు, బెదిరింపులు, అక్రమ వ్యాపారాలు ఇతర నేరాలకు పాల్పడే వారిపై పోలీస్ శాఖ దృష్టి సారించింది. రౌడీ షీటర్లు గా ఉన్న వారు, గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారి వివరాలను కూడా సేకరించి వారిని స్థానిక పీఎసలకు పిలిపించి కౌన్సిలిం గ్ నిర్వహిస్తున్నారు. తాజాగా వీరు దిగిన ఫొటోలతోపాటు నమోదైన కేసులు, శిక్షలు కూడా పోలీసులు రికార్డు చేసుకుంటున్నారు. ప్రస్తుతం రౌడీ షీటర్లు ఏఏ పనులు చేస్తున్నారో వారి జీవన విధానంతోపాటు వారి ప్రవర్తన, కుటుంబ పరిస్థితులను కూడా సేకరిస్తున్నారు. రౌడీ షీటర్లుగా ఉన్న వారు కొంతమంది ప్రస్తుతం నేర వృత్తిని వదిలి కుటుంబంతో గడుపుతూ వ్యాపారాలు చేసుకుంటున్నారు.

బైండోవర్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఎస్పీ చందనా దీప్తి



రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల సంఘం సూచనల మేరకు శాంతి భద్రతలకు విఘాతం పాల్పడే అవకాశమున్న పాత నేరస్థులు, రౌడీ షీటర్ల గత ఎన్నికల్లో గొడవలకు సంబంధం ఉన్న వారిపై నిఘా ఏర్పాటుచేస్తూ జిల్లాలో ఇప్పటివరకు 155 కేసుల్లో 265 మందిని సంబంధిత ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేశాం. ప్రజలంతా తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించేలా పనిచేస్తున్నాం. ఎవరైనా బైండోవర్ ఉల్లంఘించి మళ్లీ నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.



ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ హరిచందన దాసరి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

లోకసభ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన అత్యవసర సేవలు అందించే శాఖల ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశమందిరంలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉన్న ఎఫ్సిఐ, బిఎస్ఎన్ఎల్, రైల్వే, వైద్య ఆరోగ్య, ట్రాన్స్ పోర్ట్, టిఎస్ఎస్పిడిసిఎల్, పౌరసరఫరాలు, ఎక్సైజ్, పోలీస్, ఫైర్, ఇంటలిజెన్స్, ఐ అండ్ పిఆర్ శాఖల నోడల్ అధికారులతో పోస్టల్ బ్యాలెట్ పై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూచించిన అధికారులందరు వారి నియంత్రణలో పని చేసే ఉద్యోగులందరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకునేందుకు వెంటనే ఫారం-12 -డి ని అందజేసి ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పాలని అన్నారు. ఫారం -12 పొందిన ఉద్యోగులందరు వారి ఎన్నికల డ్యూటీ ఆర్డర్, ఓటరు గుర్తింపు కార్డ్ పూర్తి వివరాలతో, మీడియా ప్రతినిధులైతే ఎన్నికల సంఘం జారీ చేసిన అథారిటీ లెటర్ జతచేసి సంబంధిత నోడల్ అధికారికి నిర్దేశించిన సమయంలో సమర్పించి ధ్రువీకరణ పొంది సంబంధిత ఏ ఆర్ ఓ కు అందజేయాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ పోస్ట్ ద్వారా వేసే ఓటు కాదని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ఫెసిలిటేషన్ కేంద్రాలకు ఉద్యోగి స్వయంగా వెళ్లి ఓటు వేయాల్సి ఉంటుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనే ఉద్యోగుల వివరాలన్నీ ఎక్సెల్ షీట్ లో పొందుపరచాలని జిల్లా నోడల్ అధికారిణి ని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించవద్దని చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్ఓ డి.రాజ్యలక్ష్మి, పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారిని వి.శ్రీదేవి,ఆయా శాఖల పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేటికీ వాయిదా

నవతెలంగాణ-చండూరు

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అధికారులు పూర్తిస్థాయిలో వచ్చినప్పటికీ ఎంపిటిసిలు ఒక్కరు కూడా హాజరు కాలేదు. ఎంపీటీసీల కోరం లేనందున సమావేశాన్ని నేటికీ వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి శుక్రవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎంపీటీసీలు అధికారులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.న్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మురళీ మనోహర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రైతులు మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-చండూరు

వరి ధాన్యానికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చండూర్ ఆర్డీవో సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్థల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పేర్కొన్నారు. క్వింటాకు కనీస మద్దతు ధర ఏ రకం రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చెల్లించనున్నట్లు తెలిపారు. ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని శుభ్రం చేసి, ఎండబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా చూడాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో చండూరు మండల తాసిల్దార్ దశరథ,మండల వ్యవసాయ అధికారి రేవతి, కస్తాల వ్యవసాయ విస్తరణ అధికారి టి శ్రీ లేఖ,మానిటరింగ్ ఆఫీసర్ షణ్ముక చారి,ఇన్‌చార్జ్ సీఈవో, సిబ్బంది పాల్గొన్నారు.

స.హ. చట్టం ఉన్నా లేనట్టే..

- ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టింపు కరువు
- ఏండ్లు గడిచినా ఇవ్వని సమాచారం
- సామాజిక కార్యకర్తల రోపణలు
- బీసీ వెల్ఫేర్ లో అధికారి మారినా బోర్డు మారదా

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం 2005 అపహాస్యంగా మారుతోంది. ఒక విధంగా చెప్పాలంటే ఇది ఉండి లేనట్టుగా తయారైంది. కలెక్టరేట్లోని జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిగా గతంలో పనిచేసిన కాజా నజీమ్ అలీ అప్సర్ ఎన్నికల బదిలీలలో భాగంగా ఇతర జిల్లాకు బదిలీ అయ్యారు. కాగా గత ఫిబ్రవరి 16వ తేదీన నూతనంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గా వి. రమేష్ బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుండి నేటి వరకు కార్యాలయంలో ఏర్పాటుచేసిన స.హ. చట్టం బోర్డులో పేరును మాత్రం మార్చని వైనం. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు, సామాజిక కార్యకర్తలు, కుల సంఘ నాయకులు అధికారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎవరైనా ఆర్టిఏ ద్వారా సమాచారం అడిగితే ఆ కార్యాలయంలో, శాఖలో అవినీతి అక్రమాలు జరిగి ఉంటే అధికారులు భయపడే పరిస్థితిలు ఉండేవి. కానీ ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలలో స.హ. చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంలో జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాలలో పట్టింపు కరువైందని ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా స.హ. చట్టం నిర్వీర్యం కావడంతో వారిని ప్రశ్నించే వారే లేరన్నట్టుగా వ్యవస్థ కొనసాగుతుందన్న ఆవేదన ప్రజల్లో వ్యక్తం అవుతుంది. కొంతమంది స. హ. చట్ట, సామాజిక కార్యకర్తలు అయితే ఏళ్ల గడిచిన సమాచారం ఇవ్వకుండా స.హ. చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స.హ. చట్టాన్ని పూర్తి స్థాయి లో సమగ్రంగా అమలయ్యే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు.



కాంగ్రెస్‌లో చేరిన పీఏసీఎస్ చైర్మెన్

నవతెలంగాణ -పెద్దవూర



మండలంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న నేత పెద్దవుర పీఏసీఎస్‌చైర్మెన్ గుంటుక వెంకట్ రెడ్డి, నాయినవనికుంటా, మాజీ సర్పంచ్ రమావత్ జానీ వెంకటేశ్వరు గురువారం బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి నాగార్జున సాగర్‌లో ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రజా పాలనలో భాగంగా గ్రామ అభివృద్ధి కి సాగర్ నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత కుందూరు జానారెడ్డి చేసిన కృషికి నిదర్శనంగా బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీ లో చేరినట్లు పిఏసీఎస్ చైర్మెన్ గుంటుక వెంకట్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలోమాజీ జడ్పీటీసీ కర్నాటి లింగ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మల పల్లి చంద్రశేఖర్ రెడ్డి,కూన్ రెడ్డి రాఘవరెడ్డి,మేకల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ-మిర్యాలగూడ



కళాశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలలో కె యన్ యమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. గణిత శాస్త్రం విభాగం విద్యార్థులు 'అప్లికేషన్స్ ఆఫ్ డిఫరెన్షియల్ ఈక్వేషన్స్" అనే అంశం పైన చరిత్ర శాఖ విద్యార్థులు" నాగార్జున సాగర్ వద్ద బౌద్ధమత స్థలాలు అనే అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి బిక్షమయ్య జిజ్ఞాస పోటీలలో కళాశాలకు చెందిన విద్యార్థులు రెండు సబ్జెక్టులలో ప్రజెంటేషన్ ఇచ్చి సర్టిఫికెట్స్ అందుకున్న గణిత శాస్త్రం,చరిత్ర విద్యార్థులను ,చరిత్ర ఉపన్యాసకులు నర్సింగ్ కోటయ్య, గణిత శాస్త్ర ఉపన్యాసకురాలు నాగ రేఖా రాణి లను అభినందించారు.

మంచినీటి సమస్య రాకుండా చూస్తాం

నవతెలంగాణ -చిట్యాల టౌన్



మున్సిపల్ పరిధిలోని మంచినీటి సమస్య రాకుండా చూస్తామని మున్సిపల్ చైర్మెన్ కోమటిరెడ్డి చిన్నవెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మెయిన్ వాటర్ పైప్ లైన్ సమస్య ఉన్నందున మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవికాలంలో అన్ని వార్డులలో మంచినీటి ఎద్దడి రాకుండా చూస్తామని, వాటర్ పైప్ లైన్ లీకులను లేకుండా చూస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రేముడాల లింగస్వామి, బెల్లి సత్తయ్య, నాయకులు జిట్టా చంద్రకాంత్, వాటర్ మాన్ లావణ్య వెంకట్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ లబ్దికోసం కోతులను వాడుకుంటున్నారు

- ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి

నవతెలంగాణ-నాగార్జునసాగర్



కొండగట్టులో మనుషులు చనిపోతే వెళ్లి పరామర్శించని నాయకులు నేడు రాజకీయ లబ్ది పొందేందుకే కోతులను రాజకీయంగా వాడుకుంటున్నారని ఇలాంటి వాళ్ళను వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి అన్నారు. గురువారం కోతులు చనిపోయిన మంచి నీటి ట్యాంక్‌ను ఎన్ఎస్పీ అధికారులతో కలిసి పరిశీలించారు .అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...పాత బడ్డ ట్యాంక్‌లను తొలగించి మూగ జీవాల కోసం చిన్న చిన్న ట్యాంక్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. నందికొండలో ప్రభుత్వ ఆస్తులను కాపాడి తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పేలా అధికారులను ఆదేశించామన్నారు. ఈ ఈ 19క్వార్టర్ కేవలం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంకు మాత్రమే అలట్మెంట్ అయిందని భగత్ కు కాదని అధికారులు నోటీసులు అందజేసిన స్పందన లేదని అందుకే వాళ్ల పని వారు చేసి క్యాంప్ కార్యాలయాన్ని ఖాళీ చేయించారని ఎలక్షన్ అనంతరం క్యాంప్ కార్యాలయం నుండి పాలన సాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి,మాజీ ఎంపీపీ శంకర్ నాయక్,కౌన్సిలర్ ఈర్ల రామకృష్ణ, వైస్ చైర్మెన్ ప్రత్యేక సలహాదారుడు ఆదాసు విక్రమ్ 3వవార్డు కౌన్సిలర్ ప్రత్యేక సలహాదారుడు రామావత్ మోహన్ నాయక్, కాంగ్రెస్ నాయకులు రంగారెడ్డి, పగడాల నాగరాజు, ఉంగరాల శ్రీనివాస్, చిన్ని, మద్దాల భానుపాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-నకిరేకల్

ఆల్ ఇండియా మ్యాథ్స్ అండ్ సైన్స్ ఒలంపియాడ్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో నకిరేకల్ పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల హెడ్ మిస్సెస్ సిస్టర్ లీనా ఆంటోనీ తెలిపారు. పాఠశాలకు చెందిన ముషం కృతిక జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు, మరో 10 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారని తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థిని జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



బాగా చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి

- ఎస్వి మోడల్ హై స్కూల్ లో గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-మిర్యాలగూడ

పట్టణంలోని ఎస్వి మోడల్ హైస్కూల్ నందు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో యూకేజీ విద్యార్థులు ప్రీ ప్రైమరీ ముగించుకొని ఒకటో తరగతిలో ప్రైమరీ విద్యను ముగించుకొని 5వ తరగతి వారు హైస్కూల్ 6వ తరగతిలో ప్రమోట్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఓరుగంటి శ్యాంసుందర్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి విద్యను ముగించుకొని ముందుకు వెళు తున్నందుకు చాలా సంతోషంగా ఉందని, ప్రతి విద్యార్థి బాగా చదువుకొని వివిధ రంగాల్లో స్థిరపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఓరుగంటి విశాలాక్షి, ఇంచార్జ్ నాగలక్ష్మి రమ్య, నాగరాణి, విజయ కుమారి, సుమతి, నాగ సుధ, వరలక్ష్మి, చైతన్య, రత్నమాల, అష్రఫ్, సౌజన్య, స్వప్న, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



మహిళా రక్షణలో షీ టీమ్ బృందాలు

- ఫేస్ బుక్,వాట్స్ అప్, ఇన్‌స్టాగ్రాం లాంటి వాటి పట్ల జాగ్రత్త
- ఎస్పీ చందనా దీప్తి

నవతెలంగాణ- నల్లగొండ టౌన్

నల్లగొండ జిల్లా షీ టీమ్ బృందాలు మహిళా రక్షణలో ముందుంటూ ఎలాంటి ఆపద వచ్చిన వెంటనే స్పందిస్తూ రక్షణ కల్పిస్తుందని, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు ఎస్పీ చందనా దీప్తి గురువారం గురువారం తెలిపారు. జిల్లా పరిధిలో మార్చ్ నెలలో మొత్తం 12 ఫిర్యాదులకు రాగ వాటి విచారణ అనంతరం 09 కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో షి టీమ్ బృందాలు జిల్లా వ్యాప్తంగా జన సమూహాలు ఎక్కువగా ఉండే ప్రాంతాలతో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కళాశాలలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్ ఇలా ప్రతి చోటా డేగ కళ్లతో పర్యవేక్షణ చేస్తున్నట్టు తెలిపారు. నల్లగొండ షీ టీమ్స్ బృందాలు రక్షణ కల్పించే విషయంలోనే కాదు మహిళలు నేరుగా పోలీస్ స్టేషన్లకు రావాల్సిన అవసరం లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటూ డయల్ 100 ద్వారా, పోలీస్ శాఖ విడుదల చేసిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ పద్ధతిలో, వాట్స్ అప్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఫిర్యాదు చేసే అవకాశాన్ని మహిళలకు కల్పించి నిరంతరం షీ టీమ్స్ వారి వెన్నంటి నిలిచేలా ముందుకు సాగుతున్నాయని తెలిపారు.

సామాజిక మాధ్యమాల పట్ల జాగ్రత్తా జిల్లా ఎస్పీ

సామాజిక మధ్యమాలైన ఫేస్ బుక్, ఇన్‌స్టా గ్రామ్ లలో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టి వాటి ద్వారా పరిచయం పెంచుకోవడం, ఫోటోలు తీసుకొని మోసం చేస్తున్న కేసులు, వాట్సప్ ఫోటోలను స్క్రీన్ షాట్ తీసుకొని వాటిని మార్ఫింగ్ చేసి వాటినే ఆ అమ్మాయికి పంపి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, అందువల్ల మహిళలు, యువతులు, అమ్మాయిలు చాలా జాగ్రత్తగా ఉండాలని, సామాజిక మాధ్యమాలలో ఫోటోలు షేర్ చేసేటప్పుడు ఆలోచించి పోస్టు చేయాలని సూచించారు. అదే విధంగా పోస్ట్ చేసే ఫొటోలు ప్రైవసీలో ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలలో తెలియని ఫోన్ కాల్స్ వస్తే వాటిని ఎత్తవద్దని సూచిస్తున్నారు.



వ్యక్తిగత విమర్శలు చేస్తే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం చర్యలు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం రాజకీయ పార్టీల నాయకులు సభలు,ర్యాలీలు నిర్వహించే సమయంలో సాధారణ ప్రజలకి ట్రాఫిక్ అంతరాయం, వ్యక్తిగత విమర్శలు చేయకూడ ని జిల్లా ఎస్పీ చందనా దీప్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీ తరుపున మీటింగులు గానీ ర్యాలీలు గానీ నిర్వహించే సమయంలో రాజకీయ పాలన పరమైన అంశాలు పై మాత్రమే విమర్శించాలి గానీ ఇతర పార్టీల ప్రత్యర్థుల వ్యక్తి గత జీవితానికి సబంధించిన అంశాలు మాట్లాడొద్దని పేర్కొన్నారు. ఇతర రాజకీయ పార్టీలు నిర్వహించే బహిరంగ సభలు లేదా ఊరేగింపులో ఎలాంటి ఆటంకాలు సృష్టించరాని తెలిపారు. రాజకీయ సభలు సమావేశాలలో మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు గానీ కులాల, వర్గాల మధ్య ద్వేషాలను రేకెత్తించే విధంగా మాట్లాడకూడదని పేర్కొన్నారు. పై నిబంధనలు ఉల్లంఘిస్తే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన క్రింద ఇతర కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉండాలి

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు

నవతెలంగాణ-నల్లగొండటౌన్

హిందువులు, ముస్లింలు ఐక్యంగా ఉండాలని, విచ్ఛిన్న శక్తుల కుయుక్తులను తిప్పికొట్టాలని టీఎస్‌యూటీఎఫ్ నల్గొండ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు అన్నారు. టీఎస్ యుటిఎఫ్ నల్లగొండ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ: భవనంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. హిందువులు ముస్లింలు కలిసిమెలిసి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మౌలానా వాహిద్ సాబ్, ఖాదర్ సాబ్, యూసఫ్ అలీ, ఆఫీస్ అన్సారి, రఫిక్ సాబ్, హాజిం, హమీద్, టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, కోశాధికారి కోశాధికారి నర్రా శేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు గేర నరసింహ, నలపరాజు వెంకన్న, మురలయ్య, పగిళ్ళ సైదులు, వివిధ మండలాల బాధ్యులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సూర్యాపేట
2
శుక్రవారం | ఏప్రిల్ 05, 2024 | www.navatelangana.com

చెరువులను సాగర్ నీటితో నింపాలి

నవతెలంగాణ-నేరేడుచర్ల



సాగర్ ఆయకట్టు కింద ఉన్న సూర్యాపేట జిల్లాలోని చెరువులను కూడా తాగునీటి అవసరాలకు నింపాలని సీపీఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు, జిల్లా మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన నేరేడుచర్లలో సీపీఐ ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడుతూ...నేరేడుచర్లలోని సోమవారం చెరువు నింపితే అక్కడ నుంచి కల్లూరుకు ,కల్లూరు నుంచి పెంచికల్ దిన్న కు అక్కడి నుంచి చింతకుంట్ల, చిల్లేపల్లి చెరువులను అలుగుల ద్వారా నింప వచ్చున్నారు. తక్షణమే చెరువు కట్టకు మేజర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట సీపీఐ నాయకులు రావుల సత్యం, ఏ లక్ష్మి, చిలకరాజు శ్రీను, ఉదరవెంకన్న, వెంకట్, గోవింద గౌడ్ ఉన్నారు.

యరగాని గాంధీ మృతి తీరని లోటు

నవతెలంగాణ-కోదాడరూరల్



ఎరగాని గాంధీ మృతి కుటుంబానికి తీరని లోటు అని పీఏసీఎస్ ఛైర్మెన్ ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో గాంధీ (72) గుండెపోటుతో మరణించారు. ఆయన మృతదేహాన్ని వారు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మందలపు శేషు, వేణుగోపాల స్వామి దేవాలయ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, గ్రామ శాఖ ఎండి రఫీ , కుక్కడపు నాగరాజు సైదులు, రఫీ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ఠ చర్యలు చేపట్టండి

- వేసవిలో ప్రతి చివరి గ్రామానికి తాగునీరు చేరాలి
- అధికారులు సమన్వయంతో కలసి పనిచేయాలి
- ప్రత్యేక అధికారి రాష్ట్ర పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ అనితా రామచంద్రన్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



జిల్లాలో ఈ వేసవిలో ప్రతి చివరి గ్రామానికి త్రాగునీరు అందాలని ప్రత్యేక అధికారి రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ అనితా రామచంద్రన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని తాగునీటి పై ఏర్పాటు రివ్యూ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక పక్క వర్షాభావ పరిస్థితులు మరో పక్క అధిక ఉష్ణోగ్రతలు ఉంటున్నందున ఆదిశగా ఈ మూడు మాసాలు ఎక్కడ కూడ జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీ లలో నీటి ఎద్దడి రాకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారం పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో నీటి నిల్వలు, లభ్యత, డిమాండ్ లను దృష్టిలో ఉంచుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఎక్కడకూడా కొత్త బోర్లకు అనుమతులు ఇవ్వొద్దని అలాగే అన్ని మండలాలు, మున్సిపాలిటీలలో అవసరం మేరకు వ్యవసాయ బోర్ లకు అద్దె బేస్ లో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీలలో విలీనమైన జీ.పి లలో అలాగే ఎస్.టి హాబీటేషన్ లలో ఎక్కడ కూడా త్రాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని సూచించారు. వివిధ గ్రాంట్స్ ద్వారా మంజూరైన పనులు పది రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు . అనంతరం మండలాలు, మున్సిపాలిటీ ల వారీగా వివిధ పనులపై సమీక్షించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ఇప్పటికే పటిష్ఠ చర్యలు చేపట్టామని అన్నారు. రూరల్ ప్రాంతాల్లో ఎస్‌డీఎఫ్ కింద రూ.363.5 లక్షలతో చేపట్టిన 184 పనులలో 151 పూర్తి కాగా మిగిలిన 33 పనులు పురోగతిలో ఉన్నాయని, డి ఎం ఎఫ్ టి కింద రూ. 700.35 లక్షలతో మంజూరైన 278 పనులలో 211 పూర్తి కాగా మిగిలిన 67 పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. ఓ అండ్ ఎం కింద రూ.329 లక్షలతో చేపట్టిన 631 పనులలో 238 పూర్తి కాగా మిగిలిన 393 పనులు పురోగతిలో ఉన్నాయని అలాగే ఇతర గ్రాంట్స్ కింద రూ.82. 846 లక్షలతో చేపట్టిన 1806 పనులలో 1642 పనులు పూర్తి కాగా 164 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అదేవిదంగా అన్ని మున్సిపాలిటీలలో 15th ఫైనాన్స్, డిఎంఎఫ్‌టి కింద మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక, ఎం.బి. ఎస్.సి వెంకటేశ్వర్లు, సి.ఈ.ఓ అప్పారావు, ఆర్డీఓ మధుసూదన్ రాజు, ఆర్.డి.ఓలు సూర్యనారాయణ, వేణు మాధవ్, శ్రీనివాస్, ఎం.బి ఇంట్రా శ్రీనివాస రావు, గ్రిడ్ అరుణాకర్ రెడ్డి, ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా విడుదల

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎం.ఎల్.సి ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటర్ల తుది జాబితాను గురువారం ప్రచురించబడినదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎం.ఎల్.సి. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటివరకు జిల్లాలోని రెవెన్యూ డివిజన్ల వారీగా సూర్యాపేటలో 26059, కోదాడ 12120, హుజూర్ నగర్ 13111 మొత్తం 51290 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. సూర్యాపేటలో 31 పోలింగ్ కేంద్రాలు, కోదాడ 22, హుజూర్ నగర్ 18 పోలింగ్ కేంద్రాలు జిల్లాలో మొత్తం 71 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

నవతెలంగాణ-నాగారం



రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు అని.ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాను రైతులు సద్వినియోగం చేసుకోని మద్దతు ధరను పొందాలని ఫణిగిరి రెవిన్యూ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి మాచర్ల రమ్య తేజా అని అన్నారు. గురువారం మండలంలోని ఫణిగిరి, ఈటూరు గ్రామంలో తిరుమలగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడుతూ రైతులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రభుత్వం అందించే మద్దతు ధర ఏ-గ్రేడ్ 2203, బి-గ్రేడ్ 2183 రూపాయలను పొందాలన్నారు. కొనుగోలు సెంటర్లో రైతులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది ఉపేంద్ర, ఉష, సర్వన్, మల్లేష్, మహేష్ ,నాగార్జున శ్రీను, లింగయ్య , తదితదితర రైతులు పాల్గొన్నారు.

బలవంతంగా పాలేరుకు నీళ్లు తరలించడం అన్యాయం

నవతెలంగాణ-గరిడేపల్లి

నిర్బంధంగా లిఫ్ట్ ఇరిగేషన్ విద్యుత్తును తొలగించి తూముల దగ్గర పోలీసు బలగాలు ఉపయోగించి బలవంతంగా పాలేరుకు నీరు తరలించడం అన్యాయమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెదరమట్ల వెంకటేశ్వరరావు, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకులు పోటు లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు అన్నారు. గురువారం వెలిదండ గ్రామంలోని ఎన్ఎస్పి కెనాల్ వద్ద ఆయా పార్టీల ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్వ ద్వారా ఈ ప్రాంతంలో చెరువులు, కుంటలకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తొలగించిన విద్యుత్తును పునర్ధరించి తక్షణమే లిఫ్టుల ద్వారా చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. ఎన్ఎస్పి అధికారులు ఏకపక్షంగా పాలేరుకు నీరు తరలించడం సరైన కాదన్నారు భూగర్భ జలాలు అడుగంటి గ్రామాల్లో మంచి నీటి కొరత తీవ్రంగా ఉందని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన లిఫ్టుల ద్వారా చెరువులు.కుంటలు నింపి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు .ఈ ధర్నాలో న్యూ డెమోక్రసీ నాయకులు మేకల కనకారావు నందిగామ సైదులు కామల్ల నవీన్ ఎల్లావుల సైదులు శ్రీకాంత్ యానాల సోమయ్య వట్టెపు



సైదులు తదితరులు పాల్గొన్నారు.

హుండీ డబ్బులు మాయం

నవతెలంగాణ-మోతే

శ్రీ కంఠమహేశ్వర స్వామి సూరమంబ కళ్యాణ ఉత్సవాలు మండల పరిధిలోని రాఘవపురం రాఘవపురం ఎక్స్ రోడ్డు గ్రామస్తులు మార్చి 29 30 31 తేదీలలో బ్రహ్మాండంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భగుడిలో ఉన్న హుండీ డబ్బులు మాయమైనట్లు దేవాలయ నిర్వాహకులు గౌడ కులస్తులు అందించిన సమాచారం మేరకే ప్రకటన గురువారం విడుదల చేశారు. పనివారు ఆలయాన్ని పరిశుభ్రం చేస్తున్న సమయంలో లాకర్ తెరుచుకొని ఉండడంతో నిర్వాహకులకు సమాచారం అందించారు. వారు సొత్తు మాయమైనట్లు గుర్తించినట్లు తెలిసింది. గౌడ కులస్తులు ఆలయాన్ని కులస్తుల కథలు చెప్పే జెట్టి కులానికి నాలుగు రోజులపాటు స్వాధీనం చేశారు.జెట్టి కులస్తుల ఆ డబ్బులు మాయం చేసినట్లు నిర్వాహకులు తెలుపుతున్నారు. ఒక నిర్వాకుడు తాను రూ.2000 హుండీలో వేస్తే కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

నవతెలంగాణ-ఆత్మకూర్ ఎస్

మండల పరిధిలోని మంగలి తండా, పాత సూర్యాపేట, ఏనుబాముల, గట్టికల్, గ్రామాలలో ఐకెపి అధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఏపీఎం మంజుల ప్రారంభించారు. సకాలంలో ఆరబెట్టిన ధాన్యం ను కేంద్రంలో విక్రయించాలని రైతులకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ దివ్యసీసీలు చందు సుధాకర్ చందు నాయక్, సరస్వతి, కమిటీ మెంబెర్స్ గ్రామ రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు టీవీ బహుకరణ

నవతెలంగాణ-నేరేడుచర్ల



నేరేడుచర్ల మండలం దిర్శించర్ల ప్రాథమిక పాఠశాలకు హ కీ.శే గుంటిపల్లి సూర్య నారాయణ స్మారకార్థం వారి కూతురులైన జి రమాదేవి, జి కవిత రూ.12000 ఖరీదైన టీవీని మండల విద్యాధికారి పి. చత్రు నాయక్ చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులు కట్టా మాధవి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సూర్యనారాయణ (రిటైర్డ్ టీచర్) స్మారకార్థం పాఠశాలకు టీవీ బహుకరించినందుకు వారి కూతుర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో దర్శించర్ల నేరేడుచర్ల ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు పుట్లూరు సత్యనారాయణ రెడ్డి, బట్టు మధు, నేరేడుచర్ల పిఆర్‌టియు అధ్యక్షులు చల్లా ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు డి వెంకటలక్ష్మి, బి స్వాతి,వి నాగ శంకర్, పి రవి, మరియు మాజీ విద్యా కమిటీ చైర్మన్ కుంటి గొర్ల సైదులు అంగన్వాడి టీచర్ వెంకటరమణ పాల్గొన్నారు.

కరెంట్‌ను పునరుద్ధరించి లిఫ్టులు నడపాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-మునగాల



ఎత్తిపోతల పథకాలకు తొలగించిన విద్యుత్తును వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం కొక్కిరేణి ఎత్తిపోతల పథకం ఆవరణలో రైతుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యు త్ శాఖ అధికారులు లిఫ్టులకు కరెంటు డిస్కషన్ చేయటం విడ్డూరంగా ఉందన్నారు.కరెంటు కనెక్షన్ ఇచ్చి లిఫ్టుల ద్వారా సాగర్ నీటితో చెరువులు నింపాలని సూచించారు. నిర్బంధంగా లిఫ్ట్ ఇరిగేషన్ విద్యుత్తును తొలగించి తూ ముల దగ్గర పోలీసు బలగాలు ఏర్పాటు చేయటం ఏమిటని ప్రశ్నించారు. సాగర్ ఎడమ కాల్వకు విడుదల చేసిన నీటిని బలవంతంగా పాలేరుకు తరలించడం అన్యాయమన్నారు. తొలగించిన విద్యుత్తును పునర్ధరించి తక్షణమే లిఫ్టుల ద్వారా చెరువులు కుంటలు నింపాలని కోరారు. ఎన్ఎస్పి అధికారులు ఏకపక్షంగా పాలేరుకు నీరు తరలించ డం సరైన కాదని అన్నారు.ఈ ప్రాంత చెర్వులు కుంటలు ఎండబెట్టి పాలేరుకు నీరు తీసుకుపోవటం ఎంత వరకు సమంజసమన్నారు. భూగర్భ జలాలు అడుగంటి గ్రామాల్లో మంచి నీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు.ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన లిఫ్టుల ద్వా రా చెరువులు.కుంటలు నింపి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. ఈ సమా వేశంలో లిఫ్ట్ ఇరిగేషన్ మాజీ చైర్మన్ పోటు లక్ష్మయ్య,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, నందిగామ సైదులు, కామల్ల నవీన్, ఎల్లావుల సైదులు,శ్రీకాంత్, యా నాల సోమయ్య, వట్టెపు సైదులు,పాల్గొ న్నారు.

'మాదిగలను మోసం చేస్తే ఏ పార్టీకైనా పతనం తప్పదు'



నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

రాష్ట్రంలో ప్రస్తుత పార్లమెంటు 17 నియోజకవర్గాలకు సంబంధించిన మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించక పోవడం తో ఏ పార్టీకైనా పతనం తప్పదని ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న మాదిగ అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అధ్వర్యంలో నిరసన కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు చింత వినయ్ బాబు మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనని చెప్పుకుంటూ రెడ్డిల పాలన పటేళ్ల పాలన కొనసాగిస్తుందన్నారు. 12 శాతం ఉన్న మాదిగలకు ఒక్క స్థానం కేటేయించకుండా అవమానపరిచారని 5 శాతం ఉన్న రెడ్లకు 6 సీట్లు ఇవ్వడంఏంటని ప్రశ్నించారు. గతంలో రేవంత్‌రెడ్డి జెడ్పిటిసి స్థాయి నుండి ఎమ్మెల్యే, ఎంపి, నేడు ముఖ్యమంత్రి వరకు తనకు మాదిగలు అండగా ఉన్నారని పలు మార్లు చెప్పి నేడు మాదిగ సామాజిక వర్గానికి అన్యాయం చేయడం పట్ల అవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, ఎర్ర వీరస్వామి మాదిగ, బోడ శ్రీరాములు మాదిగ,బొజ్జ వెంకన్నమాదిగ, దైద వెంకన్నమాదిగ, చెరుకుపల్లి సతీష్ మాదిగ, దైద శ్రీను మాదిగ, తాటిపాముల నవీన్ మాదిగ, కొండేటి గోపి మాదిగ, మాతంగి సైదులు మాదిగ,సిరిపంగి నవీన్ మాదిగ, చింత మధు మాదిగ,కాటేపల్లిసందీప్ మాదిగ, మామిడి మైసయ్యమాదిగ, బత్తులవెంకట్రాములు మాదిగ, బిక్షంమాదిగ, తదితరుల పాల్గున్నారు.

సుదర్శన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిలకు సన్మానం

నవతెలంగాణ-సూర్యాపేట



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నూకల సుదర్శన్ రెడ్డి,సబ్ ఇన్‌స్పెక్టర్ గా పదవి విరమణ పొందిన అలుగుబెల్లి జగన్‌మోహన్‌రెడ్డిలకు గురువారం స్థానిక సంఘ భవనంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూకల సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా తనవంతు పాత్ర పోషించి అందరి మన్ననలను పొందుతానని పేర్కొన్నారు. అలుగుబెల్లి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ 40 సంవత్సరాలు పోలీసు వివిధ శాఖలో పనిచేసి చిన్న స్థాయి నుండి సబ్ ఇన్స్పెక్టర్ గా పదవి విరమణ పొందడం జరిగిందని తెలిపారు. ఓసి రెడ్డి కులం వారికి ప్రమోషన్లు కరువై తాను యసై గా పదవి విరమణ పొందే దౌర్భాగ్యస్థితి ఎదుర్కొన్నానని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటినుండి రెడ్డి కుల సంఘం శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గోదాల రంగారెడ్డి,ప్రధాన కార్యదర్శి చిలుముల సునీల్ రెడ్డి,కొండపల్లి దిలీప్ రెడ్డి,దేవి రెడ్డి రవీందర్ రెడ్డి,తుమ్మ రామచంద్ర రెడ్డి(ఎల్ఐసి),దండ వెంకట్ రెడ్డి,కట్కూరి చంద్రారెడ్డి,నూకల రవీందర్ రెడ్డి,యాస లక్ష్మారెడ్డి,బోళ్ల సోమిరెడ్డి, సూరం అనిల్ రెడ్డి, చిలుమల సైదిరెడ్డి, వెన్న వెంకట్‌రెడ్డి, పక్కిరు సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తేమ శాతం ఆధారంగా కాంటాలు వేయాలి

నవతెలంగాణ-అర్వపల్లి



రైతుల ధాన్యాన్ని తేమశాతం ఆధారంగా సీరియల్ ప్రకారం కాంటాలువేయాలని ఏఓ ఏపీఎం ఆర్ శశిధర్‌రెడ్డి మల్లేశం అన్నారు. గురువారం మండలంలోని బొల్లంపల్లి ,కొమ్మాల ,కోడూరు ,లోయపల్లి ,సూర్య నాయక్ తండ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని, ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతుల పేర్లను క్రమ పద్ధతిలో నమోదు చేసుకోవాలని ఆదేశించారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకువచ్చి కనీస మద్దతు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శోభారాణి సీసీలు పద్మ నగేష్ కే మంజుల దుర్గమ్మ చంద్రశేఖర్ మహేష్ రవీందర్ సరస్వతి యాదమ్మ సరోజన శ్రీను రమణమ్మ సరళ శ్రీనివాసు బాబు వెంకన్న సైదులు ఆయా గ్రామాల రైతులు గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

లిఫ్టుల ద్వారా చెరువులు, కుంటలు నింపాలి

నవతెలంగాణ-పెన్‌పహాడ్



మండలంలో ప్రవహిస్తున్న సాగర్ నీటిద్వారా దోసపహాడ్, అన్నారం, గడ్డిపల్లి లిఫ్టుల ద్వారా చెరువులు, కుంటలు నింపాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రణపంగ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగర్ నీటిని ఎడమ కాలువ ద్వారా పోలీసులు, రెవెన్యూ యంత్రాంగాన్ని ఉపయోగించి నిర్బంధంగా పాలేరు రిజర్వాయర్ కు నీటిని తరలించడం సరైన పద్ధతి కాదని, నీటి పంపిణీలో సమన్యాయం పాటించి, ప్రజల దాహార్తిని తీర్చాలని ఆయన అన్నారు. యుద్ధ ప్రాతిపదికన పాలేరుతో పాటు జిల్లాలోని అన్ని మేజర్ చెరువులు, కుంటలు లిఫ్టుల ద్వారా నింపి ప్రజలకు తాగు నీరందించాలని డిమాండ్ చేశారు. మండలం ఆయకట్టు ప్రాంతమని వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి, సాగర్ నీరందక యాసంగిలో వేసిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారన్నారు. జిల్లా మంత్రి ఉత్తమ్ చొరవ చూపించి సాగర్ నీటితో అందించి చెరువులు కుంటలు నింపి తాగునీటి ఇబ్బందులు లేకుండా తొలగించాలని కోరారు.

అన్ని గ్రామాల్లోనూ ఐకేపీ కేంద్రాలు ప్రారంభించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



యాసంగి ధాన్యం చేతికి వచ్చినందున అన్ని గ్రామాల్లో వెంటనే ఐకేపీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మాభిక్షం భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాసంగి వరి సీజన్ ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రభుత్వం వెంటనే అన్ని గ్రామాల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం మూలంగా రైతులు ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్మాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. దీంతో గిట్టుబాటు ధర లభించక రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. వర్షాభావంతో ఇప్పటికే సగం వరి చేలు ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయించిన మద్దతు ధరల బ్యానర్ పెట్టాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన బోనస్ 500రూ కూడా ఈ రబి లో రైతుల ఎకౌంట్లో జమ చేయాలని కోరారు. జిల్లాలో అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే ప్రత్యేక సమావేశం నిర్వహించి తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాలలో అద్దె బోర్లు ద్వారా ప్రజలకు తాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.ఎండిపోయిన వరి పంటకు ఎకరాకు 25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు చామల అశోక్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కొండలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం



మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ కృష్ణయ్య ప్రారంభించారు. రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకొని ప్రభుత్వం నిర్ణయించిన ధరలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆఫీసు సిబ్బంది సెక్రటరీ బొడ్డుపెల్లి శేఖర్, చిలువేరు శంకర్, యాదయ్య, వెంకటేష్, రవి రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్



రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన సంఘటన గురువారం చౌటుప్పల్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లాకు బలిపర్వ మండలం కొమినేని వారియెల్లెంకు చెందిన బోజ సామ్రాజ్యం (60) తన అల్లుడు గోవిందవరపు సురేష్‌తో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. చౌటుప్పల్‌కు రాగానే హైదరాబాద్‌కు వెళ్తున్న లారీని వెనుకనుండి కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సామ్రాజ్యం అక్కడికక్కడే మృతిచెందింది. డ్రైవర్ సురేష్‌కు తీవ్రగాయాలయ్యాయి.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని బంగారుగడ్డ ఆసుపత్రికి తరలించారని తెలిపారు.

ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- కలెక్టర్ హనుమంతు కె జెండగే

నవతెలంగాణ-భువనగిరి

ఈసారి వేసవి తీవ్రంగా ప్రభావం చూపుతుందని దీనివల్ల ఎండలో పనిచేసే వారు వడదెబ్బ భారీగా పడకుండా ప్రజలు జాగ్రత్త తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె జెండగే తెలిపారు .గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాపారావు అధ్యక్షతన వడదెబ్బ నివారణ కోసంజిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఖనిజ లవణాలు విసర్జించబడుట వల్ల డిహైడ్రేషన్ కు గురై వడదెబ్బ తగులుతుందన్నారు. దీనిని నివారించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికలు తయారు చేసుకుని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ లో తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులు చూడాలని, అలాగే ఎంజీఎన్ఆర్ ఈఎంజిఎస్ ఈ పథకం కింద పని చేసే వారు,



టెక్నీషియన్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలన్నారు. పని వేళలు ఉదయం 12 గంటలకు పూర్తి చేసేలా చూడాలని, పనిచేసే వారికి తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే ఆరోగ్య కేంద్రాల్లో ఉండే ఓఆర్ఎస్ పౌడర్ కలిపిన నీటిని తాగడానికి ఉపయోగించాలన్నారు. ప్రజలు మధ్యాహ్న సమయంలో ప్రయాణాలు మానుకొని ఇంటి వద్దనే ఉండాలన్నారు. అడిషనల్ కలెక్టర్ కె. గంగాధర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎక్కువ సమయం ఎండాలో గడప రాదని, వ్యవసాయ పనులు ఉదయం 12 గంటలకు లోపు చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు రుమాలు, టోపీ, గొడుగు, తెల్లని దుస్తువులు ధరించాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. వై. పాపారావు మాట్లాడుతూ.. ప్రజలు ఎండలో తిరగడం వలన వడ దెబ్బ తగిలే అవకాశం ఎక్కువ ఉంది అన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఒకేసారి తీవ్రమైన జ్వరం రావచ్చు, తలనొప్పి, తల తిప్పుట, వికారం, వాంతులు అవుతాయి, మూర్ఛ పోవడం, కడుపులో తిప్పడం, నొప్పి రావడం జరగవచ్చన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గుండె సంభంధమైన ఇబ్బందులు, షుగర్ వ్యాధి ఉన్నవారు, బాలింతలు వడ దెబ్బ తగలకుండా ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. యం. సుమన్ కళ్యాణ్, డా. వంశీ క్రిష్ణ, నోడల్ ఆఫీసర్ డా. అశ్విని కుమార్ మరియు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆశీర్వదించండి

- భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎండి జహంగీర్

నవతెలంగాణ-ఆలేరుటౌను

సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆశీర్వదించడని కోరుతూ ఆలేరు పట్టణంలో గురువారం అభ్యర్థి ఎండి జహంగీర్ కోరారు. ఆలేరు పట్టణంలో పలువురు ప్రముఖులను ఆయన మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పలువివాహ శుభకార్యాలకు సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్ దొంతిరి సోమిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు కందుల నాగరాజు సోదరి వివాహానికి ,అదేవిధంగా ఇమ్మిడి నరసింహారెడ్డి ఫంక్షన్ హాల్‌లో శర్బనాపురం మాజీ సర్పంచ్ సైదాపురం నరసయ్య కుమారుడు నరేష్ వివాహానికి హాజరై నూతన



వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, పిఏసిఎస్ మాజీ డైరెక్టర్ మోరిగాడి చంద్రశేఖర్, సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్ ,డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కాసుల నరేష్ ,కందుల నాగరాజు,కంతి విక్రం, వెంకటేష్, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే జహంగీర్‌ను గెలిపించండి

నవతెలంగాణ-మోత్కూర్

స్వార్థ, అవకాశవాద,రాజకీయ నాయకులను ఓడించి, పోరాట చరిత్ర కలిగి, నిత్యం ప్రజల మధ్యన ఉంటూ, ప్రజాసమస్యలపై పోరాడుతున్న సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్ ను ప్రజలు ఆదరించి అత్యధిక మెజారిటీతో, ప్రశ్నించే గొంతును,పార్లమెంట్ కు పంపాలని, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రజలను కోరారు. గురువారం మండలంలో పాలడుగు గ్రామంలో ఆ పార్టీ గ్రామ శాఖ సమావేశం కొంపల్లి గంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి 35 సంవత్సరాలుగా ప్రజల మధ్యన ఉంటూ, ప్రజలపక్షాన నిస్వార్థంగా నిలచి, అనేక ప్రజా ఉద్యమాలను చేపట్టి, ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యం చేసి, సమస్యలను పరిష్కరించడంలో ముందుండి పోరాడారని అన్నారు. సాగునీరు అందించే పాలమూరు-రంగారెడ్డి, ఎస్ఎల్‌బిసి, ఉదయ సముద్రం, బస్వపురం, గందమల్ల, దేవాదుల, ప్రాజెక్టులను పూర్తి చెయ్యాలని, విద్య వైద్యం ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై, పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఆయనకు, సీపీఐ(ఎం)కు ఉందని అన్నారు. ఈ నియోజకవర్గంలో, భిన్న పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తున్నప్పటికి, వారు తమ స్వార్థ ప్రయోజనాలే తప్ప, ప్రజా సమస్యలపై పోరాడిన చరిత్ర లేదని, డబ్బులతో ప్రజలను తప్పుతోవ పట్టించి ఎన్నికల్లో గెలవాలనే, ప్రయత్నం చేస్తున్నారని, అన్నారు. ప్రజలు వాస్తవాన్ని గ్రహించి, ఐదేండ్లు మన భవిష్యత్తును నిర్ణయించే ఓటును, ప్రజల మధ్యన ఉంటూ, ప్రజాసమస్యల పై నిరంతరం పోరాడుతున్న సీపీఎం పార్టీ అభ్యర్థి ఎండీ జాహంగీర్ గారి సుత్తె కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కొంపల్లి ముత్తమ్మ, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, సహాయ కార్యదర్శి చింతకింది సోమరాజు, వడ్డేపల్లి లక్ష్మణ్, దడిపల్లి సైదులు,



కొంపల్లి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి : ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి కృషి చేయడంలో అగ్ర భాగాన ఉన్న సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్ కు ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి దయ్యాల నరసింహ విజ్ఞప్తి చేశారు గురువారంఆ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని అనాజిపురం, హనుమాపురంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం నిర్వహించే ఎస్ఎంఎస్ ఫంక్షన్ హాల్ లో నియోజకవర్గ స్థాయి సమావేశం హాజరు కావాలని కార్యకర్తలను కోరారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న రేవంత్ రెడ్డిపై ప్రతిపక్షాల అక్కసు

- బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారు
- తుక్కుగూడ సభ ను జయప్రదం చేయండి
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న రేవంత్ రెడ్డిపై ప్రతిపక్షాలుఅక్కసు వెళ్లగక్కుతున్నాయని,బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. నెల 6న తుక్కుగూడలో జరగబోయే జనజాతర సభను విజయవంతం చేయాలని కోరారు. గురువారం యాదగిరిగుట్టలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడూతూ జన జాతరలో జాతీయ మేనిఫెస్టో 5 న్యాయాలు ,25గ్యారెంటీలను తెలుగులో ప్రకటించనునట్లు తెలిపారు. దగపడ్డ తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలోకి తీసుకురావడానికి తుక్కుగూడ సభలో ఆరు గ్యారంటీలను ప్రకటించారన్నారు. 5న్యాయాలు, 25గ్యారంటీలను ప్రస్తుత సభలో ప్రకటిస్తారన్నారు. ఆలేరు నియోజకవర్గంలో 309బూతుల్లో 9,999మందితో తుక్కుగూడ సభకు తరలి వెళ్తాం అన్నారు. దేశంలో యువ న్యాయ, కిసాన్ న్యాయ, నారీ న్యాయ్,శ్రామిక న్యాయ్, ఎస్సీదారీ వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం అని వివరించారు .వీటిని తుక్కుగూడ సభలో ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గే,మాజీ అధ్యక్షులు రాహూల్ గాంధీ ప్రవేశపెడతారన్నారు.అధికారం పోయిన అక్కసుతో కేటీఆర్ మాట్లాడుతున్నాడన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి నరసింహస్వామి అవతారం ఎత్తి.. మీ



పేగులను మెడలో వేసుకుంటాడని కేటీఆర్, హరీష్ రావులను ఉద్దేశించి అన్నారు.బీఆర్ఎస్ చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయన్నారు. బీఆర్ఎస్ అధికారాన్ని అనుభవించి అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు.రాబోయే ఎంపీ ఎన్నికల్లో చామల కిరణ్ కుమార్ రెడ్డిని ఆలేరు నియోజకవర్గం నుంచి లక్ష మేజార్టీ ఇస్తామన్నా రు.4,500 ఇందిరమ్మ ఇండ్లు ఆలేరులో పేదలకు ఇవ్వబోతున్నామన్నారు.బీఆర్ఎస్, బీజేపీలకు కాలం చెల్లిందని,ఒకరు సెంటిమెంట్‌తో.. మరొకరు మతంతో ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు.తొమ్మిదిన్నర సంవత్సరాలు అధికారం ఇస్తే మదం ఎక్కి బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారనిదుయ్యబటారు. ఈ సమావేశంలో పీసీసీ పరిశీలకులు వేణుగోపాల్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు అండేం సంజీవ రేడ్డి ,ఎంపీపీలు , జెడ్పీటీసీలు, మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రిక్షా కార్మికుల సంక్షేమమెక్కడా?

- కానుమరుగౌతున్న రిక్షాలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు, రిక్షా కార్మికులకు అందడం లేదంటే నిజమే అని చెప్పాల్సి ఉంటుంది. నేటికీ పురపాలక, ప్రధాన పట్టణాలలో రిక్షాలు అరా కొరగా కనబడుతుంటాయి. రిక్షా అనే ప్రధాన వృత్తిగా గత 40, 50 సంవత్సరాల పూర్వం నుండి అదే వృత్తిని నమ్ముకొని ఇంకా జీవిస్తున్న కుటుంబాలు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కనబడుతూనే ఉన్నాయి. పూర్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దాదాపు 1500 కుటుంబాల వరకు రిక్షాలనే ప్రధాన వృత్తిగా నమ్ముకొని జీవనం సాగించేవారు. 1984 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో మొట్టమొదట, మొదటిసారిగా టిడిపి ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా పదవి చేపట్టగానే రిక్షా కార్మికులకు, మరి మీద ఉన్న ప్రేమ అభిమానంతో దుస్తులు పంపిణీ చేశారు. ఆ తర్వాత క్రమంలో ప్రభుత్వాలు అనేకం మారినప్పటికీ ఏనాడు రిక్షా కార్మికులను, పార్టీలు కానీ ప్రభుత్వాలు కానీ పట్టించుకోలేదు. ఒక కాలంలో రిక్షాలో ప్రయాణించాలంటే ఎంతో మోతుబారి సేటు, రైతులు అయి ఉండాలి. అలాంటి వారే రిక్షాలలో ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి ప్రయాణం చేసేవారు. ఇద్దరు ప్రయాణం చేస్తే ఒక రూపాయి నుండి రెండు రూపాయల వరకు దూరం పట్టి కిరాయి చెల్లించేవారు. హైదరాబాదు పట్టణం లాంటి ప్రాంతాలలో సినిమా హీరోలు,



వ్యాపారవేత్తలు , రెడ్డి వ్యాపారులు రిక్షాలలో ప్రయాణించేవారు. 1985, 90 సంవత్సర మధ్యకాలంలో కాల క్రమంలో రిక్షాల స్థానంలో ఆటో రిక్షాలు వచ్చి చేరాయి. ఆటో రిక్షాలు, రిక్షాలు పోటీ పోటాపోటీగా దాదాపు 15 సంవత్సరాల నడిచినప్పటికీ, ఆటోల స్థానంలో అద్దె కార్లు, సొంత కార్లు ,మోటార్ సైకిల్ ప్రజలు కొనుగోలు చేశారు. ఆలేరు పట్టణంలో 35 రిక్షాల వరకు పూర్వకాలంలో ఉంటే, ప్రస్తుతం రిక్షాల సంఖ్య కేవలం 3 మూడుకు చేరింది. రోజంతా వీరు కష్టపడితే కేవలం 100 నుండి 150 రూపాయలకు మాత్రమే గిట్టుబాటు అవుతుందని రిక్షా కార్మికులు చెబుతున్నారు. ఒకో రోజు మాత్రం పని, కిరాయి దొరకనట్లయితే ఉట్టి చేతులతోనే వెళ్లాల్సి వస్తుందని , ఆలేరు మండలం మదనపల్లి గ్రామానికి చెందిన రిక్షా కార్మికుడు ద్యగల యాదగిరి నవతెలంగాణ కి తెలియజేశారు. ఆలేరు తాలూకాగా ఉన్నప్పుడే వ్యాపారం బాగా జరిగిందని, నేడు ఆలేరు పట్టణంలో వ్యాపార లావాదేవీలు పూర్తిగా తగ్గిపోయాయని, ఈ కారణం కేవలం ఉపాధి అవకాశాలు పాలకులు సక్రమంగా నిరుద్యోగులకు కల్పించకపోవడంతో వెనుకబాటు గురైందని రిక్షా కార్మికులు తెలియజేస్తున్నారు. రిక్షా కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, అభివృద్ధి సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

ఉపాధి అవకాశాలు తగ్గాయి: రిక్షా కార్మికుడు ద్యాగల యాదగిరి

ఆలేరు తాలూకా కేంద్రంగా ఉన్నప్పుడు వివిధ ప్రాంతాల నుండి ఆలేరు ప్రాంతానికి వివిధ పనుల నిమిత్తం ప్రజలు వచ్చేవారు.వాది అవకాశాలు తగ్గడంతో రిక్షా కార్మికుల కిరాయిలు తగ్గాయి. ఎన్టీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పట్లో చొక్కా, లాగు, టోపీ అంటే ఒక జత దుస్తులు మాత్రమే పంపిణీ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాకు ఉపాధి అవకాశాలు పెంపొందించాలి. ఆలేరు ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. మాలాంటి వాళ్లకు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉద్యోగాలు ఇవ్వాలి.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో రంజాన్ వేడుకలు

నవతెలంగాణ-భువనగిరి



పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రంజాన్ పండుగ వేడుకలు జరుపుకున్నారు. దీనిలో భాగంగా ఉపాధ్యాయులు రంజాన్ పవిత్ర మాసానికి సంబంధించిన ప్రాముఖ్యతను వివరించారు. ఆతర్వాత అందరు విద్యార్థులు మిఠాయిలు ,పండ్లు పంచుకున్నారు. ఈ సందర్భం గా పాఠశాల ప్రిన్సిపాల్ రఘు అఖిల మాట్లాడుతూ పాఠశాలలో అన్ని పండుగలు జరుపుకోవడం ద్వారా విద్యార్థులకు పండుగల ప్రాముఖ్యత విశిష్టత అవగాహన కలుగుతుంది అని వివరించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-రాజాపేట

మండలంలోని కాల్వపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన సుంకే యాదగిరి కుటుంబానికి గురువారం ఇంజ నరేష్ 5,000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కళ్లెం పాండు, ఇంజ శ్రీరాములు,చేర్యాల నాగయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కాకల్ల శ్రీకాంత్, శేవల్ల యాదగిరి, కాకల్ల కిష్టయ్య ,సుంకే నర్సింహులు, కళ్ళెం యాదగిరి, ఇంజ నరేష్, ఇంజ కరుణాకర్, ఇంజ నానీ, ఇంజ ప్రవీణ్, ఇంజ కర్ణాకర్, పవన్, కార్తీక్, అజిత్, సంజయ్, వారి కుటుంబ సభ్యులకు అందజేశారులి. కుటుంబాన్ని పరామర్శించారు.

గోనె సంచులను ముందస్తుగా చేరవేయాలి

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్



నవతెలంగాణ-భువనగిరి

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులను ముందస్తుగా చేరవేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. బెన్‌షాలోమ్ సూచించారు. ధాన్యం కొనుగోళ్ళు, రవాణా కొనసాగుతున్న తీరుపె జిల్లా రవాణా కాంట్రాక్టర్లతో గురువారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ ప్రారంభమైనందున రవాణా కాంట్రాక్టర్లు కొనుగోలు కేంద్రాలకు సరిపడా గోనె సంచులను ముందస్తుగానే చేరవేయాలని, ధాన్యం రవాణాకు ఎలాంటి అంతరాయం కలగకుండా వాహనాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఏ విధమైన సమస్యలు వచ్చినా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ గోపీ కృష్ణ, డి.ఎస్.ఓ. శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం అమ్మి నష్టపోవద్దు



నవతెలంగాణ-వలిగొండరూరల్

రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని మధ్య దళారీలకు అమ్మి నష్టపోవద్దని స్థానిక తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని సంగెం, గోకారం, వర్కట్ పల్లి, జాలుకాల్వ, నెమిలకాల్వ, గొల్లెపల్లి, నాగారం, లోతుకుంట, లింగరాజుపల్లి, అక్కంపల్లి, నాతాళ్లగూడెం, మాందాపురం, రెడ్లరేపాక, వెల్వర్తి,ఎం తుర్కపెల్లి, నరసాయగూడెం, వేములకొండ, నరసాపురం, దుప్పల్లి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని మధ్య దళారీలకు అమ్మి నష్ట పోవద్దని అన్నారు. రైతులు వరి ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జితేందర్ రెడ్డి, ఏపిఎం జానీ , ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ అధికారులు,ఆయా గ్రామాల సంఘ బంధం సభ్యులు,ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి మోత్కుపల్లి సోదరుడు మృతి

నవతెలంగాణ-రాజాపేట

మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోత్కుపల్లి నరసింహులు సోదరుడు (అన్న) మండలంలోని కేశవపురంగ్రామ మాజీ సర్పంచ్ మోత్కుపల్లి ఎల్లయ్య గురువారం మృతి చెందారు. మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు గురువారం జరిగిన అంతక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.



ఎన్నికల సన్నాహాక సమావేశాన్ని జయప్రదం చేయండి

నవతెలంగాణ-మోత్కూర్

తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అధ్యక్షతన ఈనెల 6న నాగారంలోని ఆనంద గార్డెన్స్‌లో జరిగే నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నబోయిన రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కొనతం యాకుబ్ రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్



యాదవ్ ను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. సన్నాహక సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు మరి అనిల్, దాసరి తిరుమలేష్, బత్తిని తిరుమలేష్ మాజీ సర్పంచ్, మోరిగాల వెంకన్న, నల్ల పోగుల సతీష్, గురజాల నాగేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

నవతెలంగాణ-భువనగిరి



ఈ నెల 3న ఎన్‌జీవో సంఘం భవనంలో నిర్వహించిన యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘ సమావేశం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గూడూరు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దొంతరబోయిన దైవాదీనం, ముఖ్య సలహాదారులు గా పోలి శంకర్ రెడ్డి, లీగల్ సలహాదారు గా మాటూరు బాలేశ్వర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం ఎనభై సంవత్సరాలు దాటిన సూపర్ సీనియర్ సిటిజన్స్ అయిన వి.యస్. లక్ష్మీనారాయణ, కె. మీనా రెడ్డి గారలను సన్మానించారు. తదుపరి నేషనల్ ఎక్స్ సర్వీసెమెన్ చైర్మన్ ఎల్. జగన్రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ సైనికుల సంఘ అధ్యక్షుడు అయిన సందిపాపిరెడ్డి టాసా కమాండెంట్ ల కృషి వల్ల బీబీనగర్ ఎయిమ్స్‌లో వైద్య చికిత్స అవకాశం మాజీ సైనికులకు లభించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఆలేరుటౌను

మొటకొండూర్ మండలంలోని మేడికుంటపల్లీ, దిలవర్పుర్, ఇక్కుర్తీ, చామపుర్, కొండాపూర్, ఖదిరెనిగుడెం , కటేపల్లి గ్రామాల్లో ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహశీల్దార్ శాంతిలాల్, ఎంపిడిఓ ఇందిర, అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శాంతిలాల్ మాట్లాడుతూ రైతులు తాను పండించిన ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.రైతులు ప్రైవేట్ వారికి, మధ్య దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యంను అమ్మి మద్దతు ధర పొందగలరని తెలపారు.ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారిని సుజాత , మండల ఎపీఎం జి.సత్యనారాయణ, సీసీలు కె. మల్లేష్, సంతోష ఆర్ఐ, ఏఇఓలు, పంచాయతీ సెక్రెటీస్, గ్రామ మహిళా సంఘం సభ్యులు, విఓఏ, రైతులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-భువనగిరి

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మొబైల్ మెడికేర్ యూనిట్" కార్యక్రమంలో భాగంగా గురువారం భువనగిరి పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చల్ల జయశ్రీ వైద్య బృందం సేవలు అందించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం 64 మందికి ఉచితంగా మందులు అందజేయడం జరిగింది. అలాగే 7 గురికి ఈసిజి పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ పి రామాంజనేయులు రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారు ఇచ్చేటువంటి మందులను



క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కమిటీ వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ, జిల్లా కమిటీ డైరెక్టర్లు శేక్.హమీద్ పాశ,రాంబాయి, ఉపేందర్ రావు, స్పందన, లావణ్య, భాగ్య సుమిత్రా, ప్రసాద్, జయశ్రీ, మోహన్ రెడ్డి, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-రాజాపేట

ఇటీవల మండలంలోని బేగంపేట గ్రామంలో మరణించిన పెంట వెంకట స్వామి కుటుంబానికి గురువారంరూ.5వేల ఆర్థిక సహాయాన్ని బీఆర్ఎస్ మండల యూత్ ఉపాధ్యక్షులు మంత్రాల సుమన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవనపల్లి గణేష్ యూత్ అధ్యక్షులు వార్డ్ నెంబర్,గడ్డమీది మహేష్ చిగుర్ల గణేష్ పీర్లపల్లి బాలు ఇండ్ల స్వామి జెల్ల వినయ్ భోగ కమలాకర్ ు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
శుక్రవారం | ఏప్రిల్ 05 . 2024 | www.navatelangana.com

5నుండి12వరకు
ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-చిట్యాలటౌన్

మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఏసిరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, ఏసిరెడ్డి కృపాకర్‌రెడ్డిల జ్ఞాపకార్థం ఉచిత మెగా కంటి శుక్లం శస్త్ర చికిత్స వైద్య శిబిరాన్ని ఈనెల 5 నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వైద్య శిబిరం నిర్వాహకుడు, ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మెన్ ఏసి రెడ్డి దయాకర్‌రెడ్డి తెలిపారు. చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ కంటి వైద్యాశాల, అమెరికన్ తెలుగు అసోసియేషన్ సౌజన్యంతో ఉచిత మెగా కంటి శుక్లం శస్త్ర చికిత్స వైద్య శిభిరంని నిర్వహిస్తున్నామని కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఇక్కడే అనుభవజ్ఞులైన వైద్యులచే కంటి శుక్ల శస్త్ర చికిత్సలు కూడా చేయబడునని తెలిపారు. పూర్తి వివరాలకు 8008106566, 7989131262, 8897384164 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఉగాది పర్వదిన కరపత్రం విడుదల

నవతెలంగాణ-నకిరేకల్



శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐశ్వర్య సాయిబాబా మందిరములో క్రోధి నామ సంవత్సర ఉగాది, శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ కరపత్రాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 9న ఉగాది పండుగ రోజు సాయంత్రం నాలుగు గంటలకు బ్రహ్మశ్రీ నోరి కోదండ రామశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం, 17న సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్ రెడ్డి, కోశాధికారి ఉప్పల వెంకటరమణ, సభ్యులు పోతుల రాములు, సహాయ కార్యదర్శి తోనుపునూరి రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారు వేణుగోపాల్, దాచేపల్లి శ్రీనివాసు, బొబ్బలి నరసింహారెడ్డి పిల్లలమర్రి సునీత, తదితరులు పాల్గొన్నారు.

వరికి బోనస్ అందేనా!

- ప్రారంభమైన ధాన్యం కొనుగోల్లు
- పూర్తిస్థాయిలో అందని రైతుబంధు
- అనుమానాల్లో రైతులు

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం



యాసంగి వరి కోతలు ఊపు అందుకున్నాయి.అధికారులు ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.రైతులు పండించిన ధాన్యం తూకం వేస్తూనే ఉన్నారు.కానీ ప్రభుత్వం రైతు పండించిన వరికి క్వింటాల్ కు రూ.500 లపై ఎట్లాంటి ప్రకటన చేయలేదు. దీంతో రైతులు తమ పండించిన పంటకు మద్దతు ధర తో పాటు బోనస్ అందేనా అని ఎదురుచూస్తున్నారు.కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద ఇస్తామన్న రూ.500 బోనస్ ఇస్తారా? లేదా అనే చర్చ రైతుల్లో మొదలైంది. దీనికి తోడు యాసంగిలో రైతుబంధు పథకం కింద ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం పూర్తిస్థాయిలో అందలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఒక యాదాద్రి భువనగిరి జిల్లాలోనే 50 వేల మంది రైతులకు రూ.104 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉన్నట్టు తెలుస్తుంది.271590 మంది రైతులకు రూ.304.78 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సిన్నట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.కేవలం 226402 మంది రైతులకు రూ.199.13 కోట్లు మాత్రమే యాదాద్రి భువనగిరి జిల్లాలో జమ చేశారు.నారాయణపురం మండలంలో 1719 మంది రైతులకు రూ.19,14,85,945 జమ చేయాల్సి ఉండగా 1615 మంది రైతులకు రూ.14,54,48,727 మాత్రమే జమ చేశారు. ఇంకా 68 మంది రైతులకు రైతుబంధు అందని పరిస్థితి దాపురించింది. రైతుబంధు డబ్బుల కోసం రోజు బ్యాంకుల చుట్టూ తిరిగి ఇబ్బందులు చవిచూసిన రైతులకు బోనస్ విషయంలో అనుమానాలు తలెత్తుతున్నాయి. అడుగంటిన భూగర్భ జలాలతో అడుగడుగున ఇబ్బందులను పడుతూ యాసంగిలో వరి పండించిన రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాల్‌కు ఇస్తామన్న మద్దతు ధరతో పాటు బోనస్ రూ .500 ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా10.41 లక్షల ఎకరాల్లో వరిసాగా అయిందని సుమారుగా 18.61 మెట్రిక టన్నుల ధాన్యం ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 974 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు.ఇప్పటికే 533 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. గ్రేడ్1 ధాన్యానికి రూ. 2203,సాధారణ రకానికి క్వింటాల్ కు రూ. 2183 మద్దతు ధరగా నిర్ణయించారు.అధికారుల అంచనా ప్రకారం 18.61 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి మార్కెట్లోకి వస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు బోనస్ కింద రూ.94 వేల వరకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.



తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడాలి

నవతెలంగాణ-మునగాల

వేసవికాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ గ్రామీ ణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రా మచంద్రన్ ఆదేశించారు. గురువారం మండల పరధిలోని మాధవరం గ్రామ పంచాయతీ పంప్ హౌజ్ మరమ్మత్తుల ఆమె పరిశీలించారు. మంచినీటి సౌక ర్యానికి నిధుల కొరత లేదని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో అధిక సంఖ్యలో లేబర్ మొబిలైజేషన్ చేయాలని సూచించారు.సరాసరి వేజ్‌రేటు పెంచి ఇవ్వడానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలకి అవగాహన కల్పించి మార్కింగ్ ఇచ్చి పనులు చేయించాలన్నారు.పని ప్రదేశంలో నీడని చ్చే నెట్ మరియు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు, కమ్యూనిటి సోప్ పిట్స్ నిర్మాణం. ఐహెచ్ హెచ్ఎల్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చే యాలని చెప్పారు. గతంలో నిర్మించుకు న్నవి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలోజిల్లా కలెక్టర్ వెంకట్రావు. లోకల్ బాడీ కలెక్టర్ ప్రియాంక, ఎస్ఇ ఎంబి వెంకటేశ్వర్లు ఇఇ ఎంబి అరుణ్ కుమార్ రెడ్డి, డివై ఇఇ ఎంబి బిక్షం, ఎఇ ఆర్ డబ్ల్యూ ఎస్ మిషన్ భగీరథ ఇంట్రా రుతిక్,తాహశీల్దారు వి.ఆంజనేయులు మండల పరిషత్ అ భివృద్ధి అధికారి రమేష్ దీన్ దయాల్. ఎంపిఓ భూపాల్ రెడ్డి, ఏపీఓశైలజ, టె క్నికల్ అసిస్టెంట్ శేఖర్, పంచాయతీ కార్యదర్శి అక్షిత, ఫీల్డ్‌అసిస్టెంట్ శ్రీదేవి పాల్గొన్నారు.

అంజిరెడ్డిని పరామర్శించిన సలీం

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరెట్



తిప్పర్తి మండలం అంతయ్యగూడెం గ్రామంలో గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఐ(ఎంక్మి సీనియర్ నాయకులు నన్నూరి అంజిరెడ్డిని గురువారం ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి. సలీం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనా మాట్లాడుతూ అంజిరెడ్డి వ్యవసాయ రైతు కార్మికుల హక్కుల కోసం చేసిన పోరాటలను, పేద ప్రజల కోసం చేసిన భూపోరాటం మండలంలో పార్టీ బలోపేతానికి చేసిన కృషి గురించి గుర్తు చేశారు. అంజిరెడ్డి ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు భీమగాని గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి దయాకర్ పుట్టిన రోజు వేడుకలు

నవతెలంగాణ-నల్లగొండటౌన్



కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అద్దంకి దయాకర్ 52వ పుట్టినరోజులు వేడుకలు గురువారం నల్లగొండ జిల్లా పరిషత్ అతిథి గృహంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు గురించి కొట్లాడుతూ దళిత బహుజన హక్కుల సాధన కోసం తోడుపడుతూ వారి యొక్క అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు మానిపాటి బిక్షం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ మెంబర్ గోలి సైదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతపల్లి లింగమయ్య, మునుగోడు మాల మహానాడు అధ్యక్షుడు చలిచీమల యాదగిరి, తెలగమల మురళి, కట్ట వినయ్, చింతపల్లి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-చిట్యాలటౌన్



మండలంలెపి గుండ్రాంపల్లి సంఘం పరిధిలో గల గుండ్రాంపల్లి, సుంకేనపల్లి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం మానిటరింగ్ ఆఫీసర్ వంగూరు విజయకృష్ణ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజమల్లయ్య, సిబ్బంది రాకేష్,అరవింద్,మహేష్,విజయ్ రైతులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



నార్కట్‌పల్లి గ్రామపంచాయతీలోని చెరువులో ఉపాధిహామీ కింద చేపట్టిన పూడికతీత పనులను గురువారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. రోజుకు 300 రూపాయలు చొప్పున కూలి రావాలంటే ఎంత పని చేయాలి? అవగాహన ఉందా? అని అడిగి తెలుసుకున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎండలు విపరీతంగా ఉన్నందున ఉదయం 7 గంటలకు పనికి హాజరై కొలతల ప్రకారం పని చేసుకుని తిరిగి వెళ్లిపోవాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూలీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పిడి నవీన్, ఏపీ డి ఉపేందర్ రెడ్డి , ఎంపీడీవో ఉమేష్ , సిహెచ్‌ఓ శ్రీరాములు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



రాజకీయ ప్రకటనలకు అనుమతులు ఇవ్వాలి

- కలెక్టర్ హరిచందన దాసరి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

లోకసభ ఎన్నికల సందర్భంగా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసి ఎంసి) ద్వారా నిర్దేశించిన సమయంలో రాజకీయ ప్రకటనలకు అనుమతులను ఇవ్వాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన అన్నారు.అంతేకాక ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందించాలని ఆదేశించారు. లోకసభ ఎన్నికల సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసి ఎంసి మీడియా కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీచేసి ఎంసి ఎంసి ద్వారా నిర్వహించే పెయిడ్ న్యూస్, రాజకీయ ప్రకటనల ముందస్తు అనుమతి, సోషల్ మీడియా, తదితర అంశాలను సమీక్షించడమే కాకుండా ఇందుకు సంబంధించిన అన్ని ఫైళ్లు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికపుడు చురుకుగా ఉంటూ ప్రింట్, ఎలెక్ట్రానిక్ మీడియాలో వచ్చే పెయిడ్ న్యూస్ ప్రకటనలుపరిశీలించాలని, అనుమతులు సకాలంలో ఇవ్వాలని సమాచార శాఖ ఏడి (డిపిఆర్ ఓ) వెంకటేశ్వర్లును ఆదేశించారు.ఈ సందర్భంగా ఏడి యు.వెంకటేశ్వర్లు ఎమ్ సిఎంసి కార్యకలాపాలను జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ తనిఖీలో ఎంసి ఎంసి, డిపిఆర్ ఓ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



- ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ రూ.2203, బీ గ్రేడ్ రూ.2183 పొందాలని తెలిపారు. రైతులు తమ ధాన్య రాశులలో తాలు, మట్టిపెడ్డలు, రాళ్లు, రంగు మారిన ధాన్యం లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఎండలు బాగా విపరీతంగా ఉన్నందున రైతులు, హమాలీలు, సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 14 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.హరికృష్ణ, మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు, మార్కెట్ సెక్రటరీ రవీందర్‌రెడ్డి, సీసీ బ్యాంకు మేనేజర్ రజిత, కార్యదర్శి ఎరుకలి రమేష్, మార్కెట్ సిబ్బంది ఎల్లయ్య, రాములు, బాబురావు, రైతులు, పీఏసీఎస్ సిబ్బంది కె.వినోద్, మహిపాల్ పాల్గొన్నారు.


ట్రాక్టర్ టు వీలర్ ఢీకొని వ్యక్తి మృతి

నవ తెలంగాణ -నేరేడుచర్ల

మండలంలోని సోమవారం గ్రామంలో ట్రాక్టర్ మరియు టూవీలర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. నేరేడుచర్ల ఎస్సై అజ్మీర. రవీంద్ర నాయక్ తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన నిడికొండ జానయ్య (49) తన బంధువుల ఇంట్లో సోమారం గ్రామంలోని వివాహానికి హాజరై తిరిగి వెళుతూ ఉండగా ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు. మృతుడు కుమ్మరి కులస్తుడు వాచ్ మెకానిక్ అతను తీవ్రంగా గాయపడంతో మిర్యాలగూడ ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించినట్లు తెలిపారు. అతని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోటీ పడితేనే విజయాలు సొంతం

నవతెలంగాణ-నేరేడుచర్ల



ప్రస్తుత పోటీ ప్రపంచంలో కాలానికి అనుగుణంగా పరిగెడితేనే విజయాలు సాధించగలమని మండల విద్యాధికారి పి.చత్రునాయక్ అన్నారు. స్థానిక శ్రీవాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో యులిప్స్ అనే అంతర్జాతీయ విద్యారంగ సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన డిజిటల్ ఎడ్యుకేషన్ కంప్యూటర్ ల్యాబ్ ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతకాలంలో ఆశ్రమాలలో చెట్ల కింద నుండి ప్రారంభించబడిన విద్యా విధానం రకరకాల మార్పులకు లోనవుతూ నేడు కంప్యూటర్ ఆధారిత బోధనా స్థాయికి చేరుకున్నదన్నారు. ఆ పరిజ్ఞానంతోనే నేడు చంద్రయాన్ లాంటి ఉపగ్రహాలని పంపే స్థాయికి భారతదేశం చేరుకున్నదని, కావున విద్యార్థులు పాఠశాల యజమాన్యం వారు ఏర్పాటుచేసిన కంప్యూటర్ ల్యాబ్ ఉపయోగించుకొని, వివిధ రంగాలలో ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కొణతం. సీతారాం రెడ్డి, మాట్లాడుతూ...యులిప్స్ అంతర్జాతీయ విద్యా రంగ సంస్థ తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 30 పాఠశాలలతో టై అప్పగా, తమది ఆరవ పాఠశాల అని , 1997 వ సంవత్సరంలోనే నేరేడుచర్లలో మొట్టమొదటిసారిగా శ్రీ సాయి రామ్ టెక్ కంప్యూటర్ అకాడమీ నెలకొల్పి విద్యా, ఉద్యోగ, వ్యాపార,గృహిణులకు కంప్యూటర్ అందించామన్నారు. అందులో భాగంగానే ఎన్. ఈ. పి 2020 విద్యా విధాన అమలు కోసం డిజిటల్ కంప్యూటర్ బేస్డ్ స్కిల్ డెవలప్మెంట్ ఎడ్యుకేషన్ ను విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో ప్రస్తుతం కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కరువులో జీవనోపాధికి సొరసాగు..

- ఉట్లపల్లి రైతు సన్నపు రెడ్డి వెంకట్ రెడ్డి వినూత్న ఆలోచన
- ఎకరం సాగు రెండు నెలల్లో ఐదు లక్షలఆదాయం
- సొర సాగులో ఇతర రైతులకు ఆదర్శం

నవతెలంగాణ -పెద్దవూర



సంప్రదాయ పంటలు, వాణిజ్య పంటలే కాదు.. కూరగాయలు సాగు చేసి అద్భుతాలు సాధిస్తున్నాడు నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం పెద్దవూర మండలం ఉట్లపల్లి గ్రామానికి చెందిన రైతు సన్నపురెడ్డి వెంకట్ రెడ్డి భూమిపై ఉన్న మక్కువతో వ్యవసాయ రంగంలోకి వచ్చాడు. ఇప్పటికే కాకర, దొండ బత్తాయి, వంటి ఎన్నో రకాల పంటలు పండిస్తూ,అందరికి ఆదర్శంగా నిలిచారు.ఒక ఎకరం సొరకాయ సాగు చేస్తూ పెట్టుబడి పోను ఆదాయం గడించి అబ్బురపరిచాడు. ఒకటికి పదిసార్లు సొర సాగు చేసి బాగా కాసిన మొక్కలను ఎంచుకుని సిద్ధం చేసుకోవడం విశేషం.సస్యరక్షణ చర్యలపై అవగాహన ఉంటే ఏ పంట నుంచైనా అధిక లాభాలు సాధించవచ్చని రైతు వెంకట్ రెడ్డి నిరూపించారు.ఈ సందర్భంగా సొర సాగు పై ప్రత్యేక నవతెలంగాణ కథనం...విత్తనాలు మంచివైతే కాపు ఎవరైనా కాపిస్తారు. కాకుంటే వర్షాలు, వాతావరణం అనుకూలించాలి. అంటున్నాడు రైతు.అధిక దిగుబడిని చూపించారు.

-మంచి విత్తనం ప్రత్యేకత ఇదీ..

సొర విత్తనం అన్ని సీజన్లలోనూ కాత కాస్తుంది. ఆకర్షణీయమైన రంగు, సైజుతో కాయలు ఉంటాయి. ఎక్కువ కాలంపాటు కాత కాస్తుంది. గింజ నాటిన 55 రోజుల్లో చెట్టు కాతకు వస్తుంది. ఆర్‌హెచ్ఎస్ వరుణ్ కంపెనీ పేరుతో ఈ విత్తనం ఎంచుకొని సాగు చేశారు.ఈ కాయలు ఎక్కువ పొడవు ఉంటాయి. ఒక చెట్టుకు ఎక్కువ సంఖ్యలో కాయలు వస్తాయి.

-సాగు వివరాలు ఇలా..

పంట విస్తీర్ణం ఒక ఎకరం, పెట్టుబడి వ్యయం: రూ.2 లక్షలు, ఒక ఎకరానికి 5,00,000 లు దిగుబడి

విక్రయించగా వచ్చిన ఆదాయంఇప్పటికి 5లక్షలు ఆదాయం లభించింది. ఇంకా 20 టన్నులు వరకు సొరకాయలు వెచ్చే అవకాశం ఉంది. అంటే ఇంకా లక్షలకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

-పొరుగు రాష్ట్రాలకుచెందిన విత్తనమే..

సాగులో మెళకువలు తెలిసినా సాగు చేసే విధానం కూడా తెలియాలి. ఇదే విషయం రైతులందరికీ తెలియాలనే ఉద్దేశంతో పొలంలో పంటను వేసి చూపించాడు ఈ రైతు. వరుణ్ రకం మంచి విత్తనం, పొరుగు రాష్ట్రలలో అధికంగా సాగు చేస్తున్నారు.

మంచి ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. గతంలో బెండ, చిక్కుడు, బీర, బీన్స్, టమాటా, పుచ్చ, మిర్చి వంటి పంటలను విత్తనాల ఏంచుకొని మరికొంత సాగు చేస్తే అవి కూడా లాభాలను తెచ్చిపెడ తాయాని రైతు వెంకట్ రెడ్డి చెబుతున్నారు.ఈ ఏడాది కూడా సొరతోపాటు బెండ, బీన్స్, టమాటా కూడా వేసేందుకు సాగు క్షేత్రాన్ని సిద్ధం చేస్తున్నాడు.

-మంచి విత్తనాన్ని ఎంచుకోవాలి..

రైతు సన్నపు రెడ్డి వెంకట్ రెడ్డి ఉట్లపల్లి



సాగు చేసే విధానంలో ఎన్ని మార్పులొచ్చినా విత్తనాన్ని ఎంచుకునే విధానంలో ఆచితూచి అడుగు వేయాలి. వాతావరణ అనుకూల పరిస్థితులను గమనించాలి. ఒకవేళ అనుకూల సమయంలో సాగు చేయాల్సి వస్తే మంచి విత్తనాలను ఎంచుకోవాలి. ఇలా సాగు చేస్తే పెట్టుబడికి మించిన ఆదాయం వస్తుంది. ఎంతో ప్రత్యేక కలిగిన వరుణ్ రకం విత్తనాలను మన తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలలో కూడా సాగు చేస్తున్నారు.

నవతెలంగాణ
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
శుక్రవారం | ఏప్రిల్ 05. 2024 | www.navatelangana.com

నూతన వదువరులను ఆశీర్వదించిన గుత్తా

నవతెలంగాన -చిట్యాల టౌన్

చిట్యాల పట్టణ కేంద్రం లోని బీఎస్ఆర్ గార్డెన్స్ లో బుధవారం నోముల పురుషోత్తమ్ కుమార్తె ప్రియాంక వివాహా కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులనూ తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు,మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, పోకల అశోక్, పోకల రమేష్,గుత్తా యువసేన నాయకులు చిన్నపాక నాగరాజు, పాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి రతన్‌సింగ్‌నాయక్ రాజీనామా

నవతెలంగాణ-మిర్యాలగూడ

బీజేపీ మిర్యాలగూడ అసెంబ్లీ కన్వీనర్ బాణవత్ రతన్ సింగ్‌నాయక్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్న చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులకు కిషన్‌రెడ్డికి రాజీనామాను ఫ్యాక్స్ ద్వారా బుధవారం పంపించారు. 2022 నవంబర్‌లో అసెంబ్లీ కన్వీనర్‌గా నియమించారని, అప్పటి నుంచి పార్టీ బలోపేతం కోసం పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రబారితో పాటు మరి కొంతమంది పార్టీ బలహీనపడే విధంగా వ్యవహరిస్తున్నారని లేఖలో ఆరోపించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పార్టీ శ్రేయస్సు కొరకు పని చేయడం లేదని, వ్యక్తిగతంగా చర్యలకు పాల్పడుతూ పార్టీని బలహీనపరుస్తున్నారన్నారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరారు.

ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చూడాలి

- నీటి వనరును నిత్యం శుభ్రం చేయడంతో పాటు, క్లోరినేషన్ చేయాలి
- తాగునీటి సరఫరా ప్రత్యేక అధికారిణి, అనితా రామచంద్రన్

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



నల్గొండ జిల్లాలోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని నల్గొండ జిల్లా తాగు నీటి సరఫరా ప్రత్యేక అధికారిని, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఆదేశించారు. గురువారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్లో జిల్లాలోని గ్రామీణ పట్టణ, ప్రాంతాలలో తగు నీటి సరఫరా పై మిషన్ భగీరథ, మున్సిపల్, ఇంజనీరింగ్,ఎంపీడీవో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూవేసవిలో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రతి ఇంటికి మిషన్ భగీరథ తాగునీరు వెళ్లాలని, ఇంజనీరింగ్ అధికారులు,ఎంపిఓ, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో గ్రామాలలో పర్యటించి తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా తాగినీటి సమస్య ఉత్పన్నమైతే తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ముఖ్యంగా అన్ని తాగు నీటి నీటి వనరులను శుభ్రం చేయించడంతోపాటు, తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని చెప్పారు.టాంకులు క్లోరినేట్ చేయాలని ఆదేశించారు. అలాగే ఎక్కడైనా ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నట్లు ఉంటే శుభ్రంగా ఉన్న వాటిని మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 884 రెవెన్యూ గ్రామాలు, 1744 హాబిటేషన్లో తాగునీటిని సరఫరా చేస్తున్నామని ,మూడు లక్షల 78,000 ఇండ్లకు తాగునీటి సరఫరా చేస్తుండగా, పట్టణ ప్రాంతంలో ప్రతిరోజు 68 ఎం ఎల్ డి నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. నల్గొండ పట్టణానికి సంబంధించి ఉదయ సముద్రంలో సరిపోయినంత తాగునీరు ఉందని చెప్పారు. ఇట్టా ద్వారా ప్రతి చివరి ఇంటికి తాగునీరు అందే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో మూగ జీవాల కోసం నీటి తొట్టేలను ఏర్పాటు చేయాలని, ఈ సందర్భంగా ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచందర్, ఆర్ అర్దబ్ల్యూఎస్-ఎస్ ఈ వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ నాగిరెడ్డి, డిపిఓ మురళీ జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు ఇంజనీరింగ్ అధికారులు,ఎంపిడి వోలు తదితరులు పాల్గొన్నారు.



మేత దొరకక మూగ జీవాల దీనస్థితి

నవతెలంగాణ- ఆలేరుటౌన్

మండుతున్న ఎండల కారణంగా, సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పచ్చటి పైరు లేక గొర్రెలు, మేకలకు మేత దొరకక అల్లాడుతున్నాయి. ఆలేరు నియోజకవర్గం వ్యాప్తంగా వ్యవసాయ భూములు వెంచర్లుగా మారడంతో ,వెంచర్ల చుట్టూ ఫినిషింగ్ వేసి గేట్ పెడుతుండడంతో వ్యవసాయ భూములు, అటవీ ప్రాంతం కాస్త కనుమరుగవుతూ వస్తుంది. ఒక్కో గొర్ల పెంపకం దారుడు 50 నుండి 100 జీవలు సాదుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 200 మంది గొర్ల కాపర్లు ఉంటారు. జీవాలకు మేత దొరకకపోవడంతో గొర్ల పెంపకం దారులు , నీటి వసతి ఉన్నవద్ద వ్యవసాయ భూములను లీజుకి, తీసుకొని గడ్డి పెంచి మరి జీవాలకు మేతను అందిస్తున్న పరిస్థితి నెలకొంది . వరి లేదా పత్తి వేస్తున్న క్రమంలో , పత్తి చేలు ఎరుడైపోయాక పత్తి చేలు లూటీ పోవడంతో , జీవాలను మేపుతుంటారు. అధికంగా పురుగుమందులు, పెస్టిసైడ్ వాడుతుండడంతో పత్తి చేయలేను సైతం గొర్లు మేకలు తినలేకపోతున్నాయని పెంపకం దారులు చెబుతున్నారు. గతంలో ఆలేరు పట్టణంలోని పర్రె గడ్డ , దుర్గారెడ్డి పర్రే, ఏం కుంట, బైరకుంట వద్ద ప్రభుత్వ భూములలో మూగజీవాలకు మేత దొరికేది. దాంతోపాటు వ్యవసాయ భూములలో గేట్ల మీద ఉండే తుమ్మ చెట్టు నుండి లభించే తూమ్మ కాయను కొట్టి జీవాలకు ఆహారంగా వేసేవారు. ఆలేరు పట్టణం లో 20 మంది, బహదూర్ పేట లో 10, సాయి గూడెం లో 20 మంది , మండలంలోని శారాజీపేట, టంగుటూరు, గొలనుకొండ, తూర్పు గూడెం, కొలనుపాక , మంతపురి , శర్వానాపురం , పలు గ్రామాలు మోటకొండూరు, రాజపేట , యాదగిరిగుట్ట , ఆత్మకూరు, గుండాల , తుర్కపల్లి గొర్ల పెంపకం దారులు

అధిక సంఖ్యలో ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గొర్ల పెంపకం దారులకు ,గొర్రెలను, మేకలను సాధుతున్న క్రమంలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వ్యవసాయ భూములు వెంచర్లుగా ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కారణంగా ఆక్రమణకు గురవుతూ వెంచర్లుగా మారుతుండడంతో గొర్ల పెంపకం దారులు జీవాలను సాధలేకపోతున్నామని చెబుతున్నారు. ప్రభుత్వ భూములను, జీవాలకు మేత మేసేందుకు కేటాయించాలని, గొర్ల పెంపకం దారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గొర్ల పెంపకం దారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి
గొర్ల పెంపకం దారుడు కావటి బక్కయ్య



గొర్రెలు మేకలు మూగజీవాలను సాగుతున్న క్రమంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. జీవాలకు మేత దొరకడం లేదు. వ్యవసాయ భూములు లీజుకు తీసుకొని మరి నీళ్లు పెట్టి, రెడ్డి పెంచి , జీవాలను బతికించుకోవాల్సి వస్తుంది. జీవాలు తిరిగేందుకు స్థలమే లేకుండా పోయింది. ఒక్కో ప్రైవేట్ భూములు పూర్తిగా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారడంతో, గొర్లు మేకలను సాకడం కష్టంగా మారింది. రానున్న కాలంలో ఈ పరిస్థితి మరింత తీవ్రతరం కానుంది. ప్రభుత్వ స్థలాలలో తుమ్మ చెట్లను పెంచేలా చేసి ,గొర్లకు మేకలకు ఆహారాన్ని ,మేత ను అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. గొర్ల పెంపకం దారులను అన్ని విధాలుగా ఆదుకోవాలి.

వడ దెబ్బ లక్షణాలు - తీసుకోవాల్సిన జాగ్రతలు



- మండల వైద్యాధికారి డాక్టర్ నగేష్

నవతెలంగాణ -పెద్దవూర

వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత, వేడిగాలులు కారణంగా వడదెబ్బ (సన్ స్ట్రోక్), డీహైడ్రేషన్ సాధారణంగా వచ్చే వ్యాధులు. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకమే నని పెద్దవూర వైద్యాధికారి నగేష్ తెలిపారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెద్దవూర లొ నవతెలంగాణ తో మాట్లాడారు. ఎండలు మండుతున్నాయి వడదెబ్బ తగిలే అవకాశం ఉందిని అన్నారు.చెమట పట్టకపోవడం,శరీర ఉష్ణోగ్రత పెరగడం,వణుకు పుట్టడం,మగత నిద్ర లేదా కలవరింతలు,ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితి వంటివి వడదెబ్బ లక్షణాలఅని అన్నారు. వద్దదెబ్బ కు గురైన వెంటనేనీరు, పళ్ళ రసాలు, కొబ్బరినీళ్ళు, మజ్జిగ ద్రవపదార్థాలుఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. అలాగే లేతవర్ణం, తేలికైన, కాటన్ దుస్తులు ధరించాలని,రోజూ కనీసం 5 నుంచి ఆరు లీటర్లు నీళ్ళు త్రాగాలి,పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి,శుభ్రంగా రెండు పూట్ల స్నానం చేయాలి.



భోజనం మితంగా చేయాలి,ఎండవేళ ఇంటి పట్టునే ఉండండి. బయటికి వెళ్ళాల్సి వస్తే గొడుగు, టోపి వంటివి తీసుకొని వెళ్ళాలి.ఇంట్లో కిటికీలు తెరిచి ఉంచాలి.ఫ్యాన్ వేసి చల్లగా ఉంచుకోవాలని సలహాలు సూచనలు చేశారు.మండు వేసవిలో,

తీవ్ర ఉష్ణోగ్రత సమయంలో ఎక్కువగా తిరగరాదు.

సూర్యకిరణాలకు, వేడిగాలికి గురికారాదు.రోడ్ల మీద చల్లని, రంగు పానీయాలు ఏ మాత్రం త్రాగవద్దు,రోడ్ల మీద అమ్మే కలుషిత ఆహారం తినకూడదు.మాంసాహారం తగ్గించాలి, మద్యం సేవించకూడదు.ఎండ వేళల్లో శరీరంపై భారం పడే శ్రమ గల పనులు చేయకూడదు.నలుపు దుస్తులు, మందముగా వున్న దుస్తులు ధరించకూడదు.నీటిని వీలైనన్ని ఎక్కువ సార్లు తీసుకోవాలి. వడదెబ్బకుగురైన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికిచేర్చాలి,చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చేస్తుండాలి.ఫ్యాను గాలి, చల్లని గాలి తగిలేలా ఉంచాలి.ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిగిన గ్లూగోజు ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణము (ఓ.ఆర్.ఎస్.) త్రాగించవచ్చు.వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు త్రాగించకూడదు.వీలయినంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం చేయించాలి. ఈ సలహాలు సూచనలు పాటిస్తే వడ దెబ్బనుంచి త్వరగా కోలుకోవచ్చని తెలిపారు.



జన జాతర భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-తిరుమలగిరి

ఏప్రిల్ నెల 6న తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ పార్టీ జన జాతర బహిరంగ సభకు తుంగతుర్తి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజా ప్రతినిధులు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ పిలుపునిచ్చారు. గురువారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని జరగబోయే ఈ సభకు వేలాదిగా తుంగతుర్తి ప్రాంతం నుండి తరలివచ్చి తమ సత్తాను నిరూపించి బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల సంక్షేమ దిశగా ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని అని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లోనే అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కిందని అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద పేదల పక్షాన నిరంతరం వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందని అని చెప్పారు. వచ్చే నెలలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, పీసీసీ సభ్యులు గుడిపాటి నరసయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేష్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు కందుకూరు అంబేద్కర్, నాయకులు ఇటికాల చిరంజీవి, తుంగతుర్తి నియోజకవర్గ మీడియా ఇన్చార్జి కందుకూరి లక్ష్మయ్య, నాయకులు ధరావత్ జమ్మిలాల్, పత్తేపురం సుధాకర్, పాలకుర్తి రాజయ్య తదితర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కందికంటి చంద్రయ్య మృతిపట్ల సంతాపం

నవతెలంగాణ-నకిరేకల్

మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు కందికంటి చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి యాదాకుల అంజయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనవెంట మాజి సర్పంచ్ అంతటి రాములు గౌడ్, నాయకులు కందికంటి జానయ్య ,మాజి ఉపసర్పంచ్ కందికంటి ప్రభాకర్, కందికంటి లింగయ్య, మాచర్ల వెంకన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు నకిరేకంటి అంజయ్య, కందికంటి పాపయ్య, యాదయ్య ఉన్నారు.

సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలి :సీపీఐ(ఎం)

నవతెలంగాణ-వేములపల్లి



సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలని సిపిఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్ రెడ్డి అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాగరు కాలువకు విడుదల చేసిన నీటితో మండలంలోని చెరువులను, కుంటలను నింపాలని త్రాగునీటి అవసరాలు తీర్చాలన్నారు.రబీ ,ఖరీఫ్ లో నీటి ఎద్దడి వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయాయని, తీవ్ర వర్షాభావ పరిస్థితి నెలకొందన్నారు.ఎడమ కాలుకు నీటి విడుదలను వారం పాటు పొడిగించాలని, త్రాగునీటి ఎద్దడి నివారించాలన్నారు. తక్షణమే యుద్ధ ప్రాతిపదికన మండల పరిధిలోని చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి పాదురు గోవర్ధన,ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సంపత్, బొంగర్ల వెంకటయ్య, శ్రీనివాస్ రెడ్డి ,రేఖ వెంకన్న, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నాగార్జునసాగర్

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీ లోని మాజీ మంత్రి జానారెడ్డి నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి పాల్గొని కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం తుమ్మలపల్లి శేఖర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకలో మాజీ కాంగ్రెస్ ఎంపీపీ శంకర్ నాయక్, మూడో అవార్డు కౌన్సిలర్ ప్రత్యేక సలహాదారుడు మోహన్ నాయక్, కాంగ్రెస్ నాయకులు రంగారెడ్డి,చిన్ని, సోషల్ మీడియా కన్వీనర్ మద్దాల భాను కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరియానికేతన్ స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్

నవతెలంగాణ-చండూరు



స్థానిక మరియా నికితన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురువారం ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి గురువర్రావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి, యాజమాన్యాన్ని అభినందించారు. చిన్నారులలో ప్రాథమిక స్థాయి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలను రాణించాలన్నారు. డాన్ బోస్కో ప్రిన్సిపాల్ బాలశౌరి, ఫాదర్ నరేష్,మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు అన్ని రకాలుగా ప్రోత్సహిస్తూ ఉన్నత చదువులకు రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ ప్రిన్సిపల్ కిరణ్ కుమారి విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య స్నేహితుల ఆర్థిక సహకారం

నవతెలంగాణ-పెన్ పహాడ్



మండలం పరిధిలోని దుపహాడ్ గ్రామానికి చెందిన మల్లేపల్లి లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయనతో 2000వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న బాల్య స్నేహితులు మృతుని కుటుంబానికి రూ.60 వేల ఆర్థిక సహాయం గురువారం అందచేశారు. ఈ సందర్భంగా చీకటిగూడెం ఎంపీటీసీ దాచేపల్లి నాగేశ్వరావు మాట్లాడుతూ తమ మిత్రుడు మల్లెపల్లి లక్ష్మీనారాయణ అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమని తన కుటుంబానికి మా వంతుగా సహకారం అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరమల్ల సైదులు, మల్లేపల్లి చంద్రశేఖర్, పిన్నని ప్రవీణ్ కుమార్, మల్లేపల్లి రవి, షేక్ ఉస్మాన్, గుంజ విజయ్ కుమార్, రణపంగ నరసయ్య, రణపంగ సైదులు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలే ఒక నాటకం :ఎమ్మెల్యే

- ముగిసిన రంగస్థలం నాటిక పోటీలు

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ మినీ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా నిర్వహించు పద్య పౌరాణిక సాంఘిక నందినీ నాటకోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు గురువారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ సంగనభట్ల నరసయ్య, సీనియర్ రంగస్థలం నటులు నూకల జానకి రాములు ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతిని వెలిగించి నాటకోత్సవాన్ని ప్రారంభించారు. ఉ10 గం.లకు టి కృష్ణ ఆర్ట్స్ థియేటర్, మిట్టపాలెం, పల్నాడు జిల్లా వారిచే లిప్రేమించే వయసేన?లి సాంఘిక నాటిక,ఉ.11గం.లకు అరవింద ఆర్ట్స్, తాడేపల్లి, గుంటూరు జిల్లా వారిచే లిజరుగుతున్న కథలి సాంఘిక నాటిక ప్రదర్శించారు నాటికల ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడారు.కొన్ని కొన్ని సమస్యలు అవి వ్యక్తిగతంగా కావచ్చు సమాజపరంగా కావచ్చు వాటి పరిష్కారానికి నాటకాల ద్వారా పరిష్కారం లభిస్తుందని నా అభిప్రాయం అన్నారు.నాకు కూడా కలలపై కొంత అవగాహన ఉన్నదని రాజకీయాలే ఒక నాటకం అన్నారు.కళాకారులకు నా వంతుగా సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందజేస్తానన్నారు బ్భారతిలోని సమస్యలను సాధ్యమైనంత త్వరలో పరిష్కారం చేస్తానని హామీనిచ్చారు.